ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 19 ఏప్రిల్ 2025 | 5



రాజమహేంద్రవరం **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 40.0 (శుక్రవారం)
కనిష్ఠం : 26.0

కదిలింది.. కరుణరథం!



గుడ్‌ఫ్రైడేను జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.. విశ్వాసులు సిలువ మోస్తూ.. కదిలింది కరుణరథం.. సాగిందీ క్షమాయుగం అంటూ ప్రార్థనా గీతాన్ని ఆలపిస్తూ క్రీస్తును కీర్తించారు.. ఉదయం నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. నలభై రోజుల ఉపవాస దీక్షలు ముగించారు.



వేములూరులో..

8

రెండో ఉచిత సిలిండర్‌కు క్యూ..



» ఉమ్మడి జిల్లాలో వినియోగదారులు 13 లక్షలు
» 2,82,198 మంది గ్యాస్ బుకింగ్
» 1,09,592 మంది ఖాతాల్లో సొమ్ము జమ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రెండో ఉచిత సిలిండర్‌కు లబ్ధిదారులు క్యూకడుతున్నారు. వేగంగా బుకింగ్‌లు చేసుకుంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతిరోజు పెద్దఎత్తున బుకింగ్స్ జరుగుతున్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో సుమారు 13 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి రెండో ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ఆరంభమైంది. ఇప్పటివరకు 2,82,198 మంది వినియోగదారులు ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోగా 1,09,592 మంది బ్యాంకు ఖాతాల్లోకి రూ.8.72 కోట్లు సబ్సిడీ సొమ్ము జమ అయింది. మిగిలిన వినియోగదారులకు మరో నాలుగు రోజుల్లో రాయితీ సొమ్ములు జమచేస్తారు. తూర్పుగోదావరి జిల్లాలో 91,382 మంది గ్యాస్ సిలిండర్లకు బుక్ చేసుకోగా 34,645 మంది వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.2.74 కోట్లు జమ అయింది. కాకినాడ జిల్లాలో 1,03,832 మంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోగా, 41,223 మంది బ్యాంకు ఖాతాల్లో రూ.3.27 కోట్ల రాయితీ సొమ్ము జమచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 86,984 మంది వినియోగదారులు గ్యాస్ సిలిండర్లకు బుక్ చేసుకోగా, 33,724 మందికి రూ.2.70 కోట్ల రాయితీ సొమ్ము జమచేశారు. వినియోగదారులు రెండో గ్యాస్ సిలిండర్‌ను ఈ ఏడాది జూలై 31వ తేదీలోపు బుక్ చేసుకోవాలని నిబంధన విధించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ దీపం-2 పథకానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. తొలి విడత, రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్లు బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు ఏదైనా కారణాల వల్ల రాయితీ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమకాకపోతే ఆయా జిల్లాల పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్లో సంప్రదించాలని సంబంధిత అధికారులు వెల్లడించారు.



రె..డీఎస్సీ!

ఉపాధ్యాయ నిరుద్యోగులకు తీపికబురు

» నెరవేరనున్న కూటమి మరో హామీ
» ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందం
» ఉమ్మడి జిల్లాలో 95 వేల మంది పైనే
» 42 నుంచి 44 ఏళ్లకు పెంపు
» వయోపరిమితి పెంపుతో ఊరట
» ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ
» సమాయత్తమవుతున్న విద్యాశాఖ

కాకినాడ రూరల్/ అమలాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. టీడీపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నేడో రేపో నోటిఫికేషన్ విడుదలకానుంది. ఈనేపథ్యంలో ఎప్పటి నుంచో డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఉపాధ్యాయుల పోస్టుల భర్తీపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అడ్డంకులు దాటుకుని..

రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ నోటిఫికేషన్‌కు కొన్ని లక్షల మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటూ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని విస్మరించింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347కు పైగా ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించి నవంబరులోనే ఫలితాలు ప్రకటించింది. కొన్ని సాంకేతిక కారణాలు, ఎమ్మెల్సీ కోడ్ అమలు, అభ్యర్థుల వయోపరిమితి పెంపు తదితర సమస్యలపై స్పష్టమైన నిర్ణయం రావాల్సి ఉన్నందున డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా పడుతూ వచ్చింది. ఇటీవల సీఎం చంద్రబాబు, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో ఏప్రిల్‌లోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ పోస్టుల భర్తీని జూన్‌కల్లా పూర్తిచేస్తామని ప్రకటించడంతో అభ్యర్థులు నోటిఫికేషన్‌కు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనెల 20 లేదా 23న డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని తెలిసి హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 95 వేల మందికిపైగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

వైసీపీ తెచ్చిన తంటా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా స్కూలు అసిస్టెంట్లు, ఎస్జీటీ పోస్టులు మొత్తం కలిపి 1026 ఖాళీగా ఉన్నట్టు విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో అమలాపురం ఉప విద్యాశాఖాధికారి పరిధిలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి 908 ఖాళీలను గుర్తించినట్టు అధికారులు నిర్ధారించారు. ఇంకా జిల్లాలో కొత్తపేట, రామచంద్రపురం సబ్ డివిజన్ల పరిధిలో ఖాళీల సంఖ్య తేలాల్సి ఉంది. అయితే ప్రభుత్వానికి నివేదించిన జాబితాలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోస్టుల సంఖ్య భారీగా కుదించి నివేదించినట్టు ఉపాధ్యాయ సంఘాల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్జీటీ పోస్టులు రద్దుచేసి వారిని వేరే పోస్టులకు కేటాయించారు. ఆ పరిస్థితుల కారణంగా ఇప్పటికీ ఎస్జీటీ పోస్టుల ఖాళీలపై స్పష్టత లేదని వారు ఆరోపిస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో ఎయిడెడ్ పోస్టులను రద్దు చేసి ఆయా పాఠశాలలను మాత్రమే ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉపాధ్యాయుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే నోటిఫికేషన్‌కు నిరుద్యోగ యువకులు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. పోస్టుల్లో కోత విధిస్తే తమకు ఏమాత్రం ప్రయోజనం ఉండదనేది వారి ఆవేదన.

వయోపరిమితి 44

డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితిని సడలిస్తూ పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం గరిష్ఠ వయోపరిమితి 42 ఏళ్లు కాగా దానిని 44 ఏళ్లకు పెంచారు. 2024 జూలై 1ని కటాఫ్ తేదీగా నిర్ణయించారు.ఈ సడలింపు ఈ ఒక్క డీఎస్సీకి మాత్రమే వర్తిస్తుందన్నారు.

● ఏపీ ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ఆర్డినెన్స్-25 జారీచేశారు. దీని ప్రకారం 3 ఎస్సీగ్రూపుల విషయంలో 200 రోస్టర్ పాయింట్ల విధానాన్ని అవలంబించనున్నారు. దీంతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి వర్గీకరణ ఆర్డినెన్స్‌తో మార్గం సుగమమైంది.

1278 పోస్టులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1,278 ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీచేయనున్నట్టు సమాచారం. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఆంగ్లం 90, తెలుగు 70, హిందీ 71, గణితం 55, ఫిజికల్ సైన్స్ 59, బయోలాజికల్ సైన్స్ 95, సోషల్ స్టడీస్ 114, సంస్కృతం 5, వ్యాయామ విద్య 199, ఎస్జీటీలు 349, పీజీటీ, టీజీటీ ప్రిన్సిపాల్స్ మొత్తం 171 ఖాళీలు డీఎస్సీ ద్వారా భర్తీచేయనున్నట్టు తెలిసింది.

ప్రత్యేక విద్యకు 288 పోస్టులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక విద్యకు సంబంధించి 151 స్కూల్ అసిస్టెంట్లు, 137 ఎస్జీటీ ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీకానున్నాయి. వారంరోజుల్లోపు డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం.ఈ మేరకు విడిగా నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన 45 రోజుల తరువాత పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది.

'సత్ప్రవర్తనతో ఉన్న ఖైదీలకు క్షమాభిక్షను దూరం చేయడం ఏ మాత్రమూ సబబు కాదు. మంచి ప్రవర్తనతో ఉన్నవారికి మరోసారి బాగా జీవించే అవకాశం కల్పించడం సరైన నిర్ణయమే'
- దేశ సర్వోన్నత న్యాయస్థానం

2019లో జైలులో ఆస్పత్రి శంకుస్థాపనకు సీఎం హోదాలో చంద్రబాబు వచ్చినప్పుడు.. 'మీరు మంచిగా మారండి. క్షమాభిక్ష జీవోల కోసం ఒత్తిడి పడొద్దు. నేనున్నాను. చూసుకుంటాను' అని హామీ ఇచ్చారు. అయితే విధి దగా చేసింది. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చింది. దీంతో క్షమాభిక్ష అవకాశాన్ని ఆ ప్రభుత్వంలో ఖైదీలు కోల్పోయారనే చెప్పాలి. ఇప్పుడు మళ్లీ అవకాశం వచ్చింది.. ఖైదీల విడుదలకు చర్యలు చేపడుతున్నారు.



ఖైదీలకూ.. నేనున్నానని..

జీవిత ఖైదీలకు క్షమాభిక్ష

» కూటమి ప్రభుత్వంలో ఊరట
» సుప్రీం మార్గదర్శకాల అమలు
» జాబితాకు ప్రభుత్వ ఆదేశం
» కసరత్తులో జైలు అధికారులు
» వైసీపీ ప్రభుత్వంలో అన్యాయం
» గత జాబితా చెత్తబుట్టలోకి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర మనోవేదన మిగిలింది. అప్పట్లో జగన్ ఖైదీల క్షమాభిక్ష పట్ల చేసిన కాలయాపన వారి పాలిట శాపంగా మారింది. 2023లో జాబితా ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాలనూ అప్పటి వైసీపీ ప్రభుత్వం పాటించకపోవడంతో ఆ జాబితా ఇప్పుడు చెత్త బుట్టలో పడేసే పరిస్థితి వచ్చింది. దీంతో రెండేళ్లుగా ఆ ఖైదీలు ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎస్ఎల్‌పీ (క్రిమినల్) నెం.529/2021లోని సుప్రీం ఆదేశాలను పాటిస్తూ ఈనెల 17న జీవో నెం.71 జారీచేయడంతో పెండింగ్‌లో ఉన్న జాబితా నీరు గారిపోయినట్టేనని చెబుతున్నారు. జైళ్లశాఖ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం క్షమాభిక్షకు అర్హులైన ఖైదీల జాబితా సిద్ధం కానుంది.

నాడు వైసీపీలో ఒక్కసారే..

సుప్రీం మార్గదర్శకాల ప్రకారం ఏడాదికి మూడు దఫాల్లో విడుదలకు అర్హులైన జాబితాలను అధికారులు ఎప్పటికప్పుడు పంపించినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో జగన్ ప్రభుత్వంలో ఎదురుచూపులతో ఖైదీలో జైలులోనే మగ్గిపోయారు. జగన్ జమానా ఐదేళ్లలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక జైలులో కలుపుకొని సుమారు 60 మంది మాత్రమే బయటకు వెళ్లారు. 2021లో విడుదలకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినా ఏడాది ఆలస్యంగా ఆగస్టు 15న 2022లో విడుదల చేశారు. మరో అన్యాయం ఏమిటంటే.. 2022లో వదిలిన ఖైదీలకు 2021ని కటాఫ్‌గా తీసుకున్నారు. అలా కాకుండా 2022 కటాఫ్‌గా తీసుకుంటే మరికొంత మంది తమ కుటుంబాల చెంతకు చేరేవారు.

సుప్రీం మార్గదర్శకాలు..

గతంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఖైదీలను విడుదల చేసేవి. దీంతో ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా నిబంధనలు ఉండేవి. వీటిపై సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పీలు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు దేశం మొత్తానికి ఒకే విధమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. వాటి ప్రకారం ఆయా రాష్ట్రాలు జీవోలు ఇవ్వాలి. ఈ మేరకు కూటమి ప్రభుత్వం సుప్రీం మార్గదర్శకాలను అనుసరిస్తూ జీవో విడుదల చేసింది.

గతం : సాధారణ జీవిత ఖైదీలకు ఏడేళ్ల శిక్ష, మూడేళ్ల రెమిషన్‌తో కలుపుకొని పదేళ్లు, 498(ఏ), డెకాయిటీ, దొంగతనాలు వంటి నేరాల్లో 14+6, మహిళలకు 3+2, 65 ఏళ్లు దాటిన వాళ్లకు ఐదేళ్ల శిక్ష, రెండేళ్ల రెమిషన్‌తో ఏడేళ్లు శిక్ష పూర్తి చేస్తే క్షమాభిక్షకు అర్హత ఉండేది.

ప్రస్తుతం : అన్ని జెండర్లకూ ఒకేలా నిబంధనలు ఉన్నాయి. మరణశిక్ష పడిన వారికి 14 ఏళ్ల జైలు.. ఆరేళ్ల రెమిషన్ మొత్తంగా 20 ఏళ్ల శిక్ష అనుభవించి ఉండాలి (ఆరేళ్ల రెమిషన్ నమోదు కావాలంటే కనీసం 16 ఏళ్లపాటు సత్ప్రవర్తనతో జైలు జీవితం గడపాలి. జీవిత ఖైదులకు 7+3 ఉండాలి. ఎన్‌డీపీ ఎస్, ఎస్సీఎస్టీ కేసుల్లో, ప్రివెన్షన్ ఆఫ్ టెర్రరిజం చట్టం 2002 ప్రకారం, ఐపీసీ 363ఏ, 364, 364ఏ, 366, 366బీ, 367, 368, 369, 372, 373 ప్రకారం శిక్షపడిన వారు క్షమాభిక్షకు అర్హులు కాదు. మరికొన్ని నిబంధనలు ఇచ్చారు.

ఏడాదికి మూడు సార్లు

సుప్రీం మార్గదర్శకాలను అనుసరించి ఏడాదికి మూడుసార్లు క్షమాభిక్ష జీవోలను విడుదలచేస్తారు. మొదటి ఫేజుకు జూన్1, రెండో ఫేజుకు అక్టోబరు 1, మూడో ఫేజుకు ఫిబ్రవరి 1 కటాఫ్ తేదీలుగా పరిగణిస్తారు. నాలుగు దశల్లో ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.ఫేజ్ 1లో భాగంగా జనవరి 1 నుంచి 15వ తేదీలోపుగా, ఫేజ్ 2లో మే 1 నుంచి 15వ తేదీలోగా, ఫేజ్ 3లో సెప్టెంబరు 1 నుంచి 15వ తేదీలోగా అర్హులైన ఖైదీలను గుర్తించాల్సి ఉంటుంది. ఆపై జైలు అధికారులు మూడు నెలల్లోగా సంబంధిత పత్రాలు సిద్ధం చేసుకోవాలి. జైలు అధికారులు ప్రిజన్స్ డైరెక్టర్ జనరల్‌కి సిఫారసు చేసిన తర్వాత మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందాలి. అనంతరం మూడు నెలల్లో ప్రభుత్వ నిర్ణయం వెలువడాలి. ఫేజ్1కి అక్టోబరు 1, ఫేజ్2కి ఫిబ్రవరి1, ఫేజ్ 3కి జూన్1లోగా ప్రభుత్వ నిర్ణయం వెలువడాల్సి ఉంటుంది.

చీటీల డబ్బుతో కుటుంబం పరారీ

నిడదవోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చీటింగ్ చేసి ఒక కుటుంబం పరారైంది. దీంతో పలువురు లబోదిబోమంటున్నారు. నిడదవోలు మండలం కంసాలిపాలెంకు చెందిన గరగ నాగలక్ష్మి చాలా కాలంగా చీటీల వ్యాపారం చేస్తుంది. నమ్మకంగా సొమ్ములు చెల్లిస్తుండడంతో కొద్ది మొత్తంతో ఆరంభమైన చీటీల వ్యాపారం లక్ష రూపాయలు వేసే వరకూ చేరింది. ఇదిలా ఉండగా ఇటీవల సుమారు 20 మంది నుంచి డబ్బులు తీసుకుని ఖాతాదారులకు సొమ్ము చెల్లించకుండా కాలయాపన చేస్తుంది. డబ్బులు చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో కుటుంబసభ్యులు గరగ బుల్లియ్య, గరగ శివరామకృష్ణలతో కలిపి ఊరు వదిలి వెళ్లిపోయిందని నక్కా నాగేశ్వరరావు శుక్రవారం సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

3735 వాహనాలు తనిఖీ

» జిల్లాలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు
» 27 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు
» 61 వాహనాలు స్వాధీనం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు నాకాబందీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 32 ప్రాంతాల్లో నలుగురు అడిషనల్ ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, ఎస్‌డీపీవోలు, 21 మంది సీఐలు, ఆర్ఐలు, 38 మంది ఎస్ఐ లు, డబ్ల్యు ఎస్ఐ ,ఆర్ఎస్ఐ, డబ్ల్యుఆర్ఎస్‌లు, 186 మంది పోలీసులు కలిసి పక్కాగా తనిఖీలు చేశారు. గురువారం రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకూ అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 32 పాయింట్లలో బస్సులు, లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలతో సహా అన్నింటినీ పరిశీలించారు. మొత్తం 3735 వాహనాలను తనిఖీ చేసి 27 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. 15 మందికి జరిమానాలు విధించారు. సరైన పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న 61 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఎంవీ యాక్ట్ ఫైన్ రూ 4,370 విధించారు.ఎస్పీ నరసింహ కిశోర్ స్వయంగా పర్యవేక్షించి పలు వాహనాల్లో సోదాలు చేశారు. సెంట్రల్ జోన్‌కి అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీ కృష్ణ, నార్త్ జోన్‌కి క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్, ఈస్ట్ జోన్‌కి ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎల్.చెం చురెడ్డి, కొవ్వూరు డివిజన్‌కి శాంతి భద్రతల అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బ రాజు సారథ్యం వహించగా.. మొత్తం సుమారు 200 మంది తనిఖీల్లో పాల్గొన్నారు.సీట్ బెల్టు,హెల్మెట్‌పై అవగాహన కల్పించారు.గోపాలపురం స్టేషన్ పరిధిలో ఒక ట్రావెల్ బస్సు డ్రైవరు మద్యం తాగి ఉండడం గమనించారు.బస్సులో 40 మందికిపైగా ప్రయాణికులున్నారు.వెంటనే ఆ డ్రైవరును బస్సు నుంచి దించేసి రెండో డ్రైవరుతో బస్సు పంపించారు.



కారును తనిఖీ చేస్తున్న డీఎస్పీ రమేష్‌బాబు



ద్విచక్రవాహనం తనిఖీ చేస్తున్న ఎస్పీ



బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

నేడు స్వచ్ఛ దివస్

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రత్యేక కాన్సెప్ట్‌తో ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా శనివారం ఈ వేస్ట్ డిస్పోజబుల్ కార్యక్రమం నిర్వహించాన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, గృహాల్లో వృథాగా ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను మునిసిపల్, గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేస్టు సేకరణ కియోస్క్‌లకు తరలించాలన్నారు.రూరల్ మండలం పరిధిలో గల వైటీసీ ప్రాంగణంలో శనివారం జిల్లాస్థాయి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పక్కన పడేసిన పనికిరాని యంత్రాలను ఆ కియోస్క్‌లకు తరలించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడికక్కడ శుభ్రంగా ఉండాలన్నారు.నేడు స్వచ్ఛ దివస్‌లో భాగంగా సిబ్బంది విధిగా దృష్టి సారించాలన్నారు.

ప్రభుత్వ బోధనాసుపత్రికి రూ.2 కోట్లతో పరికరాలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి రూ.2 కోట్ల విలువైన పరికరాలను రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సమకూర్చనున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వాసుపత్రికి అవసరమైన జనరేటర్, ఇన్వర్టర్లు, అంబులెన్సు తదితర పరికరాలను మే నెలలోపు అందించనున్నారన్నారు. విడతల వారీగా పరికరాలు ఆసుపత్రికి చేరతాయని పేర్కొన్నారు. ఆరోగ్యభారతం, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, ఆరోగ్య రాజమహేంద్రవరం పార్లమెంట్, ఆరోగ్య రాజమహేంద్రవరం సిటీ సాధనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు.


బోరు..బోరుమంటున్నారు!

వేసవి వచ్చేసింది.. చాలా ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడితో గొంతెండిపోతోంది.. తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయినా అధికారుల్లో కదలిక లేదు. ఈ చిత్రంలో చూస్తున్నారుగా ఇవి మెట్టప్రాంతమైన గోకవరం మండలంలోని అచ్యుతాపురం, కృష్ణునిపాలెం, గంగపాలెం, ఠాకూరుపాలెం, కొత్తపల్లి, గోకవరం గ్రామాల్లో చేతిపంపుల దుస్థితి.. ఇంతలా ఉన్నా ఏ ఒక్కరూ అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు. ఆయా గ్రామాలకు బోరు నీరే ఆధారం. అయినా ఎందుకో నిర్లక్ష్యం మరి.. గోకవరం మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో 480 చేతి పంపులు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. వీటిలో 465 పంపులు పనిచేస్తున్నట్టు 15 పంపులు మాత్రమే మరమ్మతుకు గురైనట్టు సంబంధింత అధికారులు లెక్కల్లో చూపిస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. సగానికి పైగా చేతి పంపులు పనిచేయడంలేదని సమాచారం. దీంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడంలేదు. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లోనూ ఈ పరిస్థితి ఉంది. తాగునీరందక బోరుబోరుమంటున్నారు. - **గోకవరం**









సెలవులకు స్వగ్రామం వచ్చి మృత్యువాత

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి




మరణించిన బూల వెంకటరత్నం, (ఫైల్‌ఫొటో)

మామిడికుదురు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో శుక్రవారం పెదపట్నంలంక గ్రామానికి చెందిన బూల వెంకటరత్నం (34) మృతిచెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వెంకటరత్నం సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కరెంటు సామాన్లు కొనడానికి మామిడికుదురు వచ్చి ప్రమాదానికి గురైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న వెంకటరత్నం 3రోజులు సెలవు రావడంతో స్వగ్రామం వచ్చి మృత్యువాత పడ్డాడని కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరులకు కలచివేస్తుంది. ఏడేళ్ల క్రితం లక్ష్మీదుర్గతో వివాహం కాగా, వారికి ఐదేళ్ల కుమారుడు భరత్‌శ్రీసాయి, రెండేళ్ల కుమార్తె మాధురిలక్ష్మి ఉన్నారు. వెంకటరత్నం మృతితో తాము జీవనాధారం కోల్పోయామని ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. కేసు నమోదు చేసినట్టు నగరంఎస్ఐ ఎ.చైతన్యకుమార్ చెప్పారు.

ధాన్యం గుట్టను ఢీకొని వ్యక్తి మృతి



వీరవెంకట రమణ (ఫైల్‌ఫోటో)

దేవరపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం కృష్ణంపాలెం సర్వీసు రోడ్డులో ధాన్యం గుట్టను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. మండలంలో కృష్ణంపాలెం యర్నగూడెనికి చెందిన పుట్టా వీరవెంకటరమణ (30) అమ్మమ్మ ఊరైన కొత్తగూడెంలో ఉంటున్నాడు. రోజువారీ కూలి పనికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి సుమారు 2.30 గంటల ప్రాంతంలో యర్నగూడెం నుంచి ద్విచక్రవాహనంపై కొత్తగూడెం వెళ్తుండగా కృష్ణంపాలెం సమీపంలోని రహదారిపై ఆరబెట్టిన ధాన్యం గుట్టను ఢీకొని తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో హైవే అంబులెన్స్‌లో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్టి

రాగి వైరు, ఆయిల్ చోరీ

దేవరపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా యర్నగూడెం, సంగాయిగూడెం మధ్యలోని ఆచంట శేషారావుకు చెందిన పొలంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్టి విలువైన రాగి వైరు, ఆయిల్‌ను దొంగిలించుకుపోయారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈకి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు శేషారావు పేర్కొన్నాడు. ఇటీవల పొలాల్లో విద్యుత్ వైర్లు కోసుకుపోవడం, ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి రాగి వైర్లు దొంగిలించటం వంటి సంఘటనలు జరుగుతున్నాయని, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

సంగాయిగూడెంలో చోరీ జరిగిన ప్రదేశం

రూ.200 నోటు మార్చాలని కోరినందుకు..

వ్యక్తిపై కిరాణా షాపు యజమాని, అనుచరుడి దాడి

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రూ.200 నోటుకు సిరా మరక ఉందని, నోటు మార్చాలని కోరినందుకు తనపై దాడికి పాల్పడ్డారంటూ జనిపల్లి శ్రీను ఇంద్రపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకెళితే కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ గాంధీబొమ్మకాలనీకి చెందిన జనిపల్లి శ్రీను గురువారం మధ్యాహ్నం రూ.500 నోటు ఇచ్చి స్థానికంగా జనచైతన్య లేఅవుట్‌కాలనీకిచెందిన లక్ష్మీ కిరాణా షాపు వద్దకు వెళ్లి సుమారు రూ.300 విలువ కిరాణా సామాన్లు కొనుగోలు చేశాడు. దీంతో ఆ షాపు యజమాని మిగిలిన చిల్లరతోపాటూ రూ.200 నోటు ఇచ్చాడు. సిరా ఇంక్ మరక అంటిన నోటుకిబదులు మరొక నోటు ఇవ్వాలని యజమానిని కోరగా, ఇద్దరి మధ్య ఘర్షణ జరగ్గా యజమాని తన అనుచరుడ్ని ఫోన్ చేసి రప్పించి తనపై కర్రతో చేతిపై, బుర్రపై దాడి చేయించినట్టు బాధితుడు శ్రీను తెలిపాడు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ బాధితుడ్ని పరామర్శించి దాడికి పాల్పడిన వ్యాపారి, అనుచరుడుపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడికి మద్దతుగా నిరసన తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇంద్రపాలెం ఎస్ఐ సూర్యకుమార్ తెలిపారు.

హైవోల్టేజీ సమస్యతో

20 టీవీలు, 10 ఫ్రిజ్‌లు, 20 ఫ్యాన్లు దగ్ధం

కామరాజుపేటలో సంఘటన

గోకవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం మండలంలోని కామరాజుపేటలో హైవోల్టేజ్ సమస్యతో గురువారం రాత్రి గృహోపకరణ వస్తువులు దగ్ధమయ్యాయి. గ్రామంలోని పెద రామాలయం వీధిలో ఈ సం ఘటన జరిగింది. వినియోగంలో ఉన్న సుమా రు 20 టీవీలు, 10 ఫ్రిజ్‌లు, 20 ఫ్యాన్‌లు, మోటార్లు, ఏసీలు, తదితర గృహపకరణ సా మాగ్రి హైవోల్టేజ్‌తో కాలిపోవడంతో బాధితులు లబోదిబోమంటు న్నారు. ఈప్రాంతంలో ఎంతోకాలం నుంచి హైవోల్టేజ్, లోవోల్టేజ్ సమస్య వేధిస్తున్న ప్పటికి సంబంధింత అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.




కాలిపోయిన గృహోపకరణ వస్తువులు

ఉపాధ్యాయులందరూ 26లోపు

నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందాలి

కాకినాడ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ పాఠశాల విద్యా శాఖ సంచాలకుల ఉత్తర్వుల ప్రకారం పూర్వపు తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ బదిలీ నియంత్రణ చట్టం ప్రకారం నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందాలని కాకినాడ జిల్లా డీఈవో రమేష్ కోరారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీ, ప్రత్యేక పాయింట్లు పొందేందుకు అర్హత ఉన్న వారు కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 24 నుంచి 26వ తేదీలోపు అనారోగ్య సంబంధిత సర్టిఫికెట్లను చూపించి నూతన మెడికల్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఈ క్యాంపులో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మెడికల్ చెకప్ చేయించుకుని వైద్యుడి నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకున్నది మాత్రమే ప్రిఫరెన్షియల్ కేటగిరీలో సమర్పించాలని డీఈవో సూచించారు.



కాకినాడకు చెందిన ఆకి వీర వెంకట నారాయణ సాయిమనోజ్‌కు, గొల్లప్రోలుకి చెందిన గ్రంధి పద్మావతి రత్నలక్ష్మి రాధాదీపికలకు గొల్లప్రోలులోని సత్యకృష్ణ కన్వెన్షన్‌లో శుక్రవారం రాత్రి వివాహం జరిగింది. సాయంత్రం వారిద్దరూ ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిపై ప్రదర్శనగా వివాహ వేదిక వద్దకు వెళ్ల అందరి దృష్టినీ ఆకర్షించారు.

జోడెడ్ల బండి.. జోడీగా వచ్చారండి!

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి)

వైద్యం అందితే బా'గుండె'...

- కాకినాడ జీజీహెచ్‌లో గుండె వ్యాధులకు అరకొర వైద్యం
- కొన్నేళ్లుగా వేధిస్తున్న వైద్యులు, పరికరాల కొరత
- వేలాదిగా వస్తున్న రోగులను పరీక్షించేది ఒకరిద్దరు వైద్యులు మాత్రమే

నిరుపేదైన వెంకట్రావుకు ఓ రాత్రి వేళ అకస్మాత్తుగా గుండె నొప్పి వచ్చింది.. వెంటనే అతడిని కుటుంబసభ్యులు ఆపసోపాలు పడి ఆటోపై కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఓపీ తీసుకుని అత్యవసర విభాగంలో చేర్చారు. ఆ సమయంలో గుండెకు సంబ ంధించిన వైద్యులు లేరో.. ఏమో అతడికి మాత్రం సకాలంలో వైద్యం అందలేదు. ఉదయం ఎప్పుడో డాక్టర్లు వచ్చి వైద్య పరీక్షలు చేశారు. ఛాతిలో నొప్పి వచ్చి కొన్ని గంటలు గడిచినా అదృష్టవశాత్తూ అతడి ప్రాణాలకు ఎటువంటి ముప్పు వాటిల్లలేదు. వాస్తవానికి గుండెలో నొప్పి వచ్చిన వారికి నిమిషాల వ్యవధిలోనే వైద్య పరీక్షలు, వైద్యం అందాలి. లేకుంటే ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి కూడా ఉంటుంది. ఇతడే కాదు.. ఇలాంటి వారెందరో కాకినాడ జీజీహెచ్‌కు వచ్చి.. పడరాని పాట్లు పడుతున్నారు. పైసలు ఖర్చు చేసి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే స్థోమత లేక ఆసుపత్రిలోనే మగ్గిపోతున్నారు.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)



కాకినాడ జీజీహెచ్‌లో గుండె వ్యాధుల చికిత్స విభాగం

కాకినాడ జీజీహెచ్‌లో పనిచేసే ఓ పెద్ద డాక్టరమ్మకు రెండు రోజుల కిందట ఓ రాత్రి వేళ సడన్‌గా హార్ట్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే ఆమెను ఆగమేఘాల మీద కాకినాడలో ఓ పేరున్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు ఈసీజీ, టూడీ ఎకోటెస్ట్‌లు, యాంజియోగ్రామ్ ఇలా అత్యాధునిక పరికరాలతో రకరకాల టెస్టులు చేసి, చివరికి స్టంటు వేశారు. ఐసీయూ రూమ్‌లో ఉంచారు. ఆమె ఆర్థికంగా స్థితిమంతురాలు కావడం, ఎంతోమంది పేదలకు వైద్య సేవలందించే పెద్దాసుపత్రిలో పెద్ద డాక్టరమ్మ కావడంతో అన్నీ క్షణాల్లో అందాయి. ఆమెకు ఎటువంటి అపాయం లేదని, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయితే ఎన్నో ఏళ్లుగా ఈ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఈ వైద్య నిపుణురాలు ఎంతోమందికి వైద్యం చేసి ప్రాణాలు నిలిపిన కాకినాడ జీజీహెచ్‌ను వదిలి ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించాల్సి వచ్చింది. ఇదంతా ఎందుకంటే...

కాకినాడ జిల్లా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి.. దశాబ్దాల తరబడి ఎంతో మందికి ఎన్నో రకాల వైద్య సేవలందిస్తోన్న అతి పెద్ద ఆసుపత్రి.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసులే కాదు.. అటు పశ్చిమ గోదావరి జిల్లా వాసులు కూడా ఇక్కడికి వైద్యం కోసం వస్తుంటారు. ఎందుకంటే ఈ ఆసుపత్రి అంటే అంత నమ్మకం.. నిష్ణాతులైన వైద్యులు ఉంటారని, మెరుగైన వైద్యం అందించి.. ప్రాణాలు నిలబెడతారనే గట్టి విశ్వాసం. సుమారు వెయ్యికిపైగా ఇన్‌పేషంట్లు ఉండే ఈ ఆసుపత్రిలో సుమారు 500కి పైగా వైద్యులు ఉన్నారు. వారిలో ప్రత్యేక వైద్య నిపుణులు కూ డా ఉన్నారు. అందుకే చుట్టుపక్కల ప్రాంతాల ఆసుపత్రి వారు కూడా అత్యవసర కేసులను ఇక్కడికే రిఫర్ చేస్తారు. ఇంత పేరున్న ఆసుపత్రిలో సామాన్యులకు సరైన వైద్యం సకాలంలో అందడం లేదని జన మెరిగిన సత్యం. ఈ ఆసుపత్రిలోని గుండె వ్యాధుల విభాగం గురించి తెలుసుకోవాలంటే కాస్త గుండె నిబ్బరం చేసుకుని చదవక తప్పదు. ఈ విభాగంలో ప్రస్తుతం ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. ఇటీవల ఒక అసోసియేట్ ప్రొఫెసర్‌ను నియమించినా విధుల్లోకి చేరలేదు. ప్రొఫెసర్‌తోపాటు మరో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం మెడికల్ విభాగానికి చెందిన హెచ్‌వోడీయే ఈ గుండె వ్యాధుల విభాగాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇద్దరు వైద్యులు, పీజీలు సేవలందిస్తున్నారు. ప్రాథమిక పరీక్షలు చేసినా శస్త్ర చికిత్సలు, స్టంట్లు వేయడంవంటి పరిస్థితులు ఇక్కడ లేవు.

గడిచిన మూడేళ్లలో జీజీహెచ్‌లో గుండె వ్యాధిగ్రస్తుల వివరాలు పరిశీలిస్తే..

- 2022లో అవుట్ పేషెంట్లు 23080, ఇన్‌పేషెంట్లు 4041
- 2023లో అవుట్ పేషెంట్లు 26849, ఇన్‌పేషెంట్లు 3179
- 2024లో అవుట్ పేషెంట్లు 30873, ఇన్‌పేషెంట్లు 3560

రోజుకి 200 మందికి ఓపీ..

ఇటీవల కాలంలో గుండె జబ్బులతో బాధపడే వారి సంఖ్య బాగా పెరిగింది. మారిన ఆహారపు అలవాటు, వ్యాయామం చేయకపోవడం, ఇలా రకరకాల కారణాలతో హృద్రోగులుగా మారుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అత్యవసర కేసులన్నీ కాకినాడ జీజీహెచ్‌కే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ ప్రతి సోమ, బుధ, శుక్రవారాల్లో ప్రత్యేకంగా ఓపీ నిర్వహిస్తుంటారు. ఆయా రోజుల్లో రోజుకి సుమారు 200 మంది వరకు రోగులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటారు. అలాగే పలు వార్డుల్లోనూ ఇన్‌పేషెంట్లుగా ఉంటూ కొందరు వైద్య సేవలు పొందుతారు.

పరికరాల కొరత..

కార్పొరేట్‌కు దీటుగా ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నాం.. దాతల సహకారంతో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నాం అని చెబుతున్నా.. అవన్నీ కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. పెద్దాసుపత్రి అన్న మాటే తప్ప.. పరికరాల కొరత మాత్రం బాగా వేధిస్తోంది. ఇక్కడ క్యాథ్ ల్యాబ్‌లో హృద్రోగులకు వైద్య పరీక్షలు చేస్తారు. యాంజియోగ్రామ్ ద్వారా రక్తనాళాల్లో బ్లాక్‌లను గుర్తిస్తారు. అవి తెరుచుకునేలా స్టంట్లు వేస్తా రు.. పేస్ మేకర్‌తో సాధారణంగా గుండె కొట్టుకునేలా చేస్తారు. నెలకు సుమారు 20 వరకు యాంజియోగ్రామ్ పరీక్షలు చేస్తున్నట్టు సమాచారం. ఇక్కడ ఒక్కో పరీక్షకు రూ.పది వేల విలువైన పరికరాలు ఉండాలి. అయితే వాటిని రోగులే సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో వైద్య పరీక్షలకు, చికిత్సకు అవసరమైన సదుపాయాలు తక్షణం కల్పించాల్సి ఉంది. అరకొరగా ఉన్న గుండె వైద్య నిపుణులను తగిన సంఖ్యలో నియమించాలని రోగులు, వారి కుటుంబీకులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు

22 మంది క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న సెలక్షన్ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ

రాజోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు 22 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని సెలక్షన్ కమిటీ చైర్మన్ జొన్నలగడ్డ గోపాలకృష్ణ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్ ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎంపికలకు సభ్యులుగా బాబి, చెల్లింగి ప్రసాద్, జిల్లా అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్, భీమేష్‌లు ఎంపికలు నిర్వహించారు. 50 మంది క్రీడాకారులు జిల్లా మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్నట్టు పాల్గొనగా 22మంది క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు. మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్‌బాల్ టీమ్ ఈనెల 26,27 తేదీల్లో సత్యసాయి జిల్లా కదిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను గోపాలకృష్ణ, ప్రసాద్, లక్ష్మణ్ అభినందించారు.

అన్నవరం దేవస్థానంలో మద్యం తాగి ఉద్యోగి విధులు

క్రమశిక్షణా చర్యలకు ఈవో ఆదేశం

అన్నవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో దిగువ ప్రసాదం కౌంటర్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మద్యం తాగి ఉండడం, ఒక భక్తురాలిపై దురుసుగా ప్రవర్తించడంతో అతడిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఈవో సుబ్బారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. కొండదిగువన ప్రసాదం కౌంటర్లో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుబ్బారావు మద్యం తాగి విధులు చేస్తుండడమే కాకుండా దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో ఈవో సుబ్బారావు నేరుగా వెళ్లి ఉద్యోగి కి బ్రీత్ ఎన్‌లైజర్ చేయగా 150 శాతం ఉండడంతో మద్యం తాగి ఉన్నట్లు గుర్తించారు. దీనిపై చర్యలకు ఆయన ఆదేశించారు. ఇటీవల కాలంలో దేవస్థానంలో పలువురు మద్యం తాగి విధులకు రావడం చర్చనీయాంశమైంది.

సూపరింటెండెంట్ బదిలీ

అన్నవరం దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఐవీ రామారావును ద్వారకా తిరుమల దేవస్థానానికి బదిలీ చేస్తూ దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల దేవస్థానంలో పలు వివాదాలు రావడానికి ఆయన ప్రధాన కారణంగా నిలిచారని ఈవో, సిబ్బందికి అంతరం ఏర్పడడానికి ఆయనే కారణమంటూ పలు ఆరోపణలు వినిపించాయి. ఇక్కడ విషయాలను క్షుణ్ణంగా తెలుసుకున్న కమిషనర్ బదిలీ వేటు వేశారు.

కరుణాకర్ రెడ్డి విమర్శలు హేయం

టీటీడీ మెంబర్ జ్యోతుల నెహ్రూ



జగ్గంపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన గోశాలలో గోవులు మరణించాయని సుదీర్ఘకాలం బోర్డులో పనిచేసిన కరుణాకర్ రెడ్డి విమర్శలు చేయడం అత్యంత హేయమని టీటీడీ మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. కాకినాడ జిల్లా జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో నెహ్రూ మాట్లాడుతూ టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఎప్పుడైనా టీటీడీ గోశాలను పరిశీలించారా అన్ని ప్రశ్నించారు. అప్పట్లో వైఎస్సార్ తర్వాత జగన్ కరుణాకర్ రెడ్డిని టీటీడీ చైర్మన్‌గా చేస్తే తిరుపతి రైల్వేస్టేషన్లో దర్శనం టికెట్లు బ్లాక్‌లో అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. టీటీడీ బోర్డు, కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. పశు సంపదను సంరక్షించేందుకు టీటీడీ బోర్డు మూడు గోశాలలను ప్రతిష్ఠాత్మకంగా నడుపుతోందన్నారు. బోర్డు మీటింగ్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్న కరుణాకర్ రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు.

సత్యదేవుని సన్నిధిలో రైల్వే డీఆర్ఎం పూజలు



సత్యదేవుని దర్శనానంతరం రైల్వే డీఆర్ఎం

అన్నవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో శుక్రవారం రైల్వే డీఆర్ఎం నరేంద్రపాటిల్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు తదితరులున్నారు. అలాగే స్వామివారి సన్నిధిలో శుక్రవారం కాకినాడ అర్బన్ డవలెప్‌మెంట్ చైర్మన్ తుమ్మల రామస్వామి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఆయన వెంట దేవస్థానం ఉద్యోగుల సంక్షేమసంఘం అధ్యక్షుడు గంటా విష్ణు ఉన్నారు.

పాదగయలో...

పిఠాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) నరేంద్ర ఆనందరావు పాటిల్ శుక్రవారం సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం ఆలయ వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ అధికారులు డీఆర్ఎంను శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. డీఆర్ఎం వెంట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ బి.శివప్రసాద్, సామర్లకోట రైల్వేస్టేషన్ మేనేజరు ఎం.రమేష్, కాకినాడ ట్రాఫిక్ ఇనస్పెక్టర్ వెంకటగిరి, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ జనార్ధనరావు, ఎంప్లాయిస్ సంఘ్ ప్రతినిధులు టి.ఈశ్వరరావు, జి.రవికాంత్ తదితరులు ఉన్నారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో పూజల్లో పాల్గొన్న రైల్వే డీఆర్ఎం కుటుంబ సభ్యులు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

పిఠాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాదగయలో నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన బొండా సుబ్బారావు రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అధికారులకు అందజేశారు. కొత్త సూర్యనారాయణ (బొండా పెద్ద బాయి) సతీమణి రావయ్యమ్మ జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందించి అన్నదానం చేయాలని కోరారు. దాతను అధికారులు సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటం అందజేశారు.



విరాళం అందజేస్తున్న దాత

శ్రామిక.. లేఇక!

స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ -రాజమహేంద్రవరం



రాజమహేంద్రవరం నగరాన్ని నిరంతరం శుభ్రంగా ఉంచే శ్రామికులు విధుల్లో మాత్రం కాస్త అజాగ్రత్తగా ఉంటున్నారు. దానికి నిదర్శనం ఈ ఫొటోలే. విధుల్లో భాగంగా ట్రాక్టర్ భాగాన ముందు కూర్చున్న కార్మికులు రోడ్డుపై పడతామేననే ఆలోచన పక్కన పెట్టి ప్రమాదభరితంగా వెళ్తున్నారు. ఒకవేళ ఏదైనా అనుకోని సంఘటన జరిగితే అప్పుడు ఏం చేసినా ప్రయోజనం ఉండదు కదా..

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

నువ్వు మారవా ...


మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కూటమి నాయకులు

• రోగుల విషయంలోనూ రాజకీయమేనా?
• మాజీ ఎంపీ భరత్‌పై ఎమ్మెల్యే ఆదిరెడ్డి ఫైర్

రాజమహేంద్రవరంఅర్బన్, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): రోగుల విషయంలోనూ రాజకీయమేనా? నువ్వు మారవా అంటూ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాజీ ఎంపీ భరత్‌రామ్‌పై ఫైర్ అయ్యారు. పారాచూట్ లీడర్, రీల్‌స్టార్ భరత్‌రామ్‌కు ప్రచారం పీక్, మేటర్ వీక్ అని ఎద్దేవా చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలోని వివిధ విభాగాలను జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, కూటమి నాయకులతో కలసి తనిఖీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వాసుపత్రి వెంటిలేటర్‌పై పడి ఉందని, ఆసుపత్రి సమస్యల గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత ప్రక్షాళన ప్రారంభించి గత పది నెలల్లోనే సుమారు 20శాతం మార్పు తీసుకురాగలిగామన్నారు. తాను, కూటమి నాయకులు 15 రోజులకు ఒకసారి ఆసుపత్రికి వచ్చి ఏదో ఒక విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నామని, వైద్యసేవల్లో నిర్లక్ష్యం చూపే వైద్యులు, వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. పారాచూట్ లీడర్ భరత్‌కు ప్రెస్‌మీట్లు పెట్టి తనను తిట్టడం తప్ప వేరే పనిలేదన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఆసుపత్రిలో సమస్యలు తెలుసుకుని వాటిని నిర్మాణాత్మకంగా ప్రశ్నించాలి తప్ప ప్రచారం పిచ్చితో నోటికొచ్చినట్టు అవాస్తవాలు మాట్లాడడం తగదన్నారు. తాను ఇంగ్లీష్ స్పెల్లింగ్ తప్పుగా పలకడంవల్ల రాజమహేంద్రవరం నగరంలో అభివృద్ధి, సంక్షేమం ఎక్కడైనా ఆగిపోయాయా అని ప్రశ్నించారు. ఏపీ పేపర్‌మిల్లు నుంచి సీఎస్ఆర్ నిధులు ఇప్పటికే రూ.కోటి 20లక్షలు వచ్చాయని, మరో రూ.40 లక్షలు రానున్నాయన్నారు. మాజీ ఎంపీ భరత్‌రామ్ కోరుకునే కళలు వేరే అని, తాము మాత్రం అసలైన కళాకారుల కోసం కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అలాగే, సున్నితమైన అంశాలపై సోషల్‌మీడియాలో ఇష్టమొచ్చినట్టు పోస్టులు పెడుతున్న యువత సామాజిక బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ బోధనాసుపత్రి స్పెషలాఫీసర్ భాస్కరరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, ఏపీఎంఎస్ఐడీసీ, ట్రాన్స్‌కో, ఇతర విభాగాల అధికారులు, తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.


నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

క్లీన్‌గా కార్పొరేషన్ కార్యాలయ ఆవరణ

• 'ఆంధ్రజ్యోతి' కథనంతో చెత్తతొలగింపు చేపట్టిన సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో చెత్త పేరుకుపోయి కార్యాలయం కంపుకొడుతుందని ఆంధ్రజ్యోతి శుక్రవారం ప్రచురించిన కథనానికి నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ స్పందించారు. నగరంలో రోడ్‌సైడ్ వ్యాపారాలు చేసుకునే వారు ఆక్రమణలకు పాల్పడితే వాటిని తొలగించే అధికారులు ఆ వ్యర్థాలను కార్పొరేషన్ వాహనంలో నగరపాలక సంస్థ కార్యాలయానికి తరలించి పార్కులో నిల్వచేశారు. నెలల తరబడి వాటిని నిల్వచేయడంతో అవి చెత్తగా మారిపోయి దారుణంగా అపారిశుద్ధ్యం నెలకొంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దీనిపై ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించడంతో కమిషనర్ స్పందించి శానిటేషన్ విభాగాన్ని ఆదేశించారు. తక్షణమే వాటిని తొలగించాలని సూచించడంతో శుక్రవారం ఉదయాన్నే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వర్కర్లు ఆఘమేఘాలపై చేరుకుని చెత్తను వ్యర్థాలను తొలగించి ట్రాక్టర్లలో తరలించారు. తోపుడుబండ్లు, బోర్డులు, ప్లెక్సీలు వంటివి ఇక్కడ నిల్వచేయడంవల్ల మిగిలిన చెత్తను తరలించడం కుదరక వదిలేసినట్టు పారిశుధ్య కార్మికులు అంటున్నారు. మొత్తం మీద వేస్ట్ మెటీరియల్ అన్నింటినీ తరలిస్తున్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీల ధర్నా

కోరుకొండ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదంటూ కోరుకొండ మండలం కాపవరం గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు శుక్రవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో ఆకలితో అలమటిస్తున్న ఉపాధి హామీ కూలీలకు 3నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటనాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం అమలు చేస్తామన్న ప్రభుత్వం సంక్షేమాన్ని ప్రక్కనబెట్టి కార్పొరేటర్ల అభి వృద్ధి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాపవరం, తదితర గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు, రైతు కూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పునర్వికాసాన్ని సాదిద్ధాం

• రాష్ట్ర కన్వీనర్ శివప్రసాద్

రాజమహేంద్రవరంకల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి బస్టాండ్‌వద్ద గల గోదావరి బాలోత్సవం కార్యాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమవేదిక తూర్పుగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లాల ప్రారంభ సభ జరిగింది. ముఖ్యవక్త వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాలు కనీస సౌకర్యాలులేక దీనస్థితిలో ఉన్నాయన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులో 8శాతం గ్రంథాలయ సెస్ కలిపి ఉంటుందని ఆ నిధుల్ని వివిధ గ్రంథాలయాల్లో కొత్త పుస్తకాలు, ఫర్నీచర్, నూతన సాంకేతిక గ్రంథాలయ వనరులను సమకూర్చడానికి ప్రభుత్వం కృషిచేయాలని ఆయన కోరారు. ఈనెల ఆదివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ రాష్ట్ర సదస్సు జరుగుతుందని, అభిలాషులందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. చల్లా రవికుమార్, పి.తులసి, రమాదేవి, సంజీవరావు, సేవారత్న లోలభట్టు శ్రీనివాసరాజు, తోరాటి వసంతరావు, భీమయ్య, జి.తాతారావు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం

• ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
• రూ.77.69లక్షల పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు

అనపర్తి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అనపర్తి నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తి మండలంలోని రామవరం, పులగుర్త గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ, ప్రారంభోత్సవాలను ఎమ్మెల్యే చేశారు. రామవరంలో రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, రూ.18లక్షలతో ఊరచెరువు పూడికతీత పనులు, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం పులగుర్త గ్రామంలో రూ.26.60లక్షలతో నిర్మించనున్న ఎనిమిది సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ, రూ.18.09లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన పదినెలల్లోనే సుమారు రూ.95కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సత్తి దేవదానరెడ్డి, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, కర్రి చిన్నారెడ్డి, సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని, తెలుగు మహిళలు కర్రి శేషారత్నం, సుభాషిణి, పేరిశెట్టి లాలయ్య, జాస్తి రాంబాబు, శివ పాల్గొన్నారు.


పులగుర్తలో సీసీ రోడ్డును ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లింల నిరసన


రాజమహేంద్రవరంలో నిరసన ప్రదర్శన చేస్తున్న ముస్లింలు

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ కేంద్ర ప్రభుత్వం చేసిన వక్ఫ్‌చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ రాజమహేంద్రవరంలో ముస్లిం మైనార్టీ సంఘాలు నిరసన ప్రదర్శన చేశాయి. రాజమహేంద్రవం జాంపేట, ఆజాద్ చౌక్ నుంచి రాజమండ్రి ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ ముస్లిం పూర్వీకులు దేవునిపేర దానం చేసిన భూములను కబళించి కార్పొరేట్లకు దోచి పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టం పేరుతో కుట్ర చేస్తుందని విమర్శించారు. చీణారా భాగస్వామ్య పక్షాలు ముస్లింలకు ద్రోహం చేశాయన్నారు. ముస్లింల అభివృద్ధి కోసం ఈ చట్టం తెస్తున్నామంటున్న బీజేపీ గత పదేళ్లుగా ఒక ముస్లింకి మంత్రి పదవిని ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కొన్ని పార్టీలు తామేదో ఈ బిల్లుని ముస్లింలకి అనుకూలంగా మార్చేశామనిఊదరగొడుతున్నారన్నారు. కానీ కొత్తచట్టం ద్వారా తీసుకొచ్చిన ప్రతి మార్పూ ముస్లింలకు వ్యతిరేకమేనని, వక్ఫ్ బోర్డును బలహీన పరిచేదేనని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఈ చట్టాన్ని వెనక్కి తీసుకునేదాక పోరాడతామన్నారు. కోకన్వీనర్ అహ్మద్ అన్సర్ మాట్లాడుతూ లిమిటేషన్ చట్టాన్ని వర్తింపచేయడం ద్వారా అన్యాక్రాంతమైన లక్షలాది ఎకరాల భూములను శాశ్వతంగా కోల్పోతారన్నారు. ఈ నిరసనలో ముస్లిం ఐక్యవేదిక యువత ఎండీ అన్సర్, కేసల్మాన్, ఎండీ అక్రమ్, ఎండీ ఆరీఫ్ ఉల్లాఖాన్, కలీం, సైఫ్, అమీర్, ఇర్ఫాన్, వాసిమ్, అన్వర్, జిలానీ, రబ్బాని రమీజ్, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ మిషన్‌చే విద్యా కార్యక్రమం

రాజమహేంద్రవరంకల్చరల్, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి గురుకులంలో శుక్రవారం రామకృష్ణ మిషన్ విలువలతో కూడిన విద్యాకార్యక్రమం నిర్వహించింది. స్వామి సేవానంద విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.విద్యార్థులు ఉన్నత విలువలు కలిగి ఉండాలని..వాటిని దైనందిన జీవితంలో పాటించి అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.

పరిశుద్ధ శుక్రవారం.. ప్రత్యేక ప్రార్థనలు

• ముగిసిన శ్రమదినాలు


క్రైస్ట్ వర్షిప్ ప్రార్థన మందిరంలో ప్రసంగిస్తున్న పాస్టర్ జాన్‌వెస్లీ


రాజానగరం చర్చిలో బిస్కెట్లు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు


దామిరెడ్డి పల్లిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

రాజమహేంద్రవరంసిటీ,ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సోదరులు 40 రోజులపాటు ఆచరించిన శ్రమదినాల ప్రత్యేక ప్రార్థనలు పరిశుద్ధ శుక్రవారం గుడ్ ఫ్రైడేతో ముగిశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 3గంటలవరకు రాజమహేంద్రవరంలో క్రైస్తవ ప్రార్థనా మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు దైవసేవకులు నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాస ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు ఉపవాసం పూర్తిచేసి అల్పాహారం స్వీకరించారు. స్థానిక సుబ్బారావునగర్‌లోగల క్రైస్ట్ వర్షిప్ సెంటర్‌లో శుభ శుక్రవారం ఆరాధన జరిగింది. ప్రారంభ ప్రార్థనను పాస్టర్ జాన్‌పీటర్ చేశారు. శిలువలో పలికిన ఏడు మాటలలో మొదటి మాటగా డాక్టర్ జాన్‌వెస్లీ, మూడో మాటను బ్లెస్సీ వెస్లీ, మిగిలిన మాటలను సంఘ పెద్దలు మాట్లాడారు. ఆరాధన అనంతరం అనేకమంది బాప్తిస్మలు స్వీకరించారు. రాజమహేంద్రవరంలో ఆర్‌సీఎం చర్చ్ ఆధ్వర్యంలో శిలువయాత్ర చేశారు. హోలీట్రినిటీ చర్చ్, సెయింట్ పాల్స్ చర్చి, సెయింట్ పీటర్స్ చర్చి, బైబిల్ ప్లేస్, లూదరగిరి చర్చి, బ్రదరన్ చర్చిల లో పరిశుద్ధ శుక్రవారం ప్రార్థనలు చేశారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే

కడియం: కడియం మండలం దామిరెడ్డిపల్లి బైబిల్‌మిషన్ మహిమ మందిరం దైవజనులు రెవ. డా.దేవరపల్లి రతన్‌రాజు ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో దేవరపల్లి సరోజిని, స్వాతి, పరిమళ, రాణి, సురేష్, రత్నకుమారి, చంద్రహాస్, ప్రసాద్, సంధ్య, వివేక్, దేవకుమార్, విజయ్, నాని, సండేస్కూల్ విద్యార్థులు, సన్నిధి స్త్రీలు, విశ్వాసులు పాల్గొన్నారు.

రాజానగరం: మండలంలో పలు చర్చిల్లో గుడ్‌ఫ్రైడేను క్రైస్తవ సోదరులంతా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా దైవజనులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజానగరంలోని శాస్త్రి పాస్టర్ చర్చిలో జనసైనికులు సైతిన చెల్లారావు, రాంబాబు, వీరమహిళలతో కలిసి బిస్కెట్లు, కేకులు, ఐస్‌క్రీమ్‌లు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

నేడు కొంతమూరులో ప్రవీణ్ పగడాలకు నివాళి

• మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మశాంతికి శనివారం సాయంత్రం 4గంటలకు రాజమహేంద్రవరం దివాన్‌చెరువు-కొంతమూరు రోడ్డులో ప్రమాద స్థలంవద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తామని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో శుక్రవారం విలేకరుతో మాట్లాడారు. ప్రవీణ్ పడగాల మృతికి సంబంధించిన పోస్టుమార్టం రిపోర్టు తీసుకున్నామని దానిలో ఆయన శరీరంపై 18 గాయాలైనట్లు ఉందన్నారు. ఇది ప్రమాదం వల్లనే జరిగిందనే నిర్ధారణ లేదన్నారు. ఎలా ప్రమాదంగా పోలీసులు ప్రకటించారని ప్రశ్నించారు. శనివారం కొంతమూరులో జరిగే కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొనాలని, ఆదివారం ఈస్టర్ పండుగ నాడు ప్రతీ క్రైస్తవ బరియల్ గ్రౌండ్‌లో పాస్టర్ ప్రవీణ్ పగడాల ప్లెక్సీ వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించాలని కోరారు. సమావేశంలో జీవీ సుందర్ పాల్గొన్నారు.

'హిందూ ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి'

రాజానగరం, ఏప్రిల్ 18 (రాజానగరం): హిందూధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని సీతారాంపురంలో గ్రామదేవత శ్రీనూకాలమ్మతల్లి తీర్థ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈకార్యక్రమంలో రాజా నగరం, గోకవరం బీజేపీ మండలాధ్యక్షుడు ఆళ్ల శివరామ కృష్ణ, ఇనకోటి బాపన్నదొర, అసెంబ్లీ కోకన్వీనర్ అడబాల గణపతిరావు, ఉపాధ్యక్షుడు వెంకట్ పాల్గొన్నారు.


సీతారాంపురంలో మాట్లాడుతున్న కంబాల శ్రీనివాసరావు

మే 20న కార్మిక సమ్మె జయప్రదం చేయాలి

• సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు
• సీఐటీయూ ప్రధాన కార్యదర్శిగా పవన్


లేబర్‌కోడ్స్‌పై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు,తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో తూర్పుగోదావరి జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లేబర్ కోడ్స్‌పై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మే 20వ తేదీన 11 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్మికవర్గం ఐక్యంగా లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలనే డిమాండ్స్‌ను కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికగా తెలియజేయనున్నామని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఇప్పుడున్న కార్మికుల హక్కులను హరించి వేయాలని చూస్తున్నదని ఆరోపించారు. ఈ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శిగా బి.పవన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు ఎస్ఎస్ మూర్తి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుందర్‌బాబు, బి.పవన్, జిల్లా కోశాధికారి కేఎస్‌వీ రామచంద్రరావు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికలతోనే
అగ్ని ప్రమాదాల నివారణ

గోకవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ముందస్తు ప్రణాళికలతో అగ్ని ప్రమాదాలను అరికట్టవచ్చని అస్సాగో ఇథనాల్ పరిశ్రమ హెచ్ఎస్ఈ మేనేజర్ బి.వి.వి.ఎ.ఎస్.ఎల్.స్వామి (సూర్య)అన్నారు. జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని గుమ్మళ్ళదొడ్డిలోగల అస్సాగో ఇథనాల్ పరిశ్రమలో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించే ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా అత్యవసర పరిస్థితిలో వ్యవహరించాల్సిన చర్యలపై వివిధ ప్రదర్శనలు, మాక్ ఎవాక్యుయేషన్ డ్రిల్స్, ఫైర్ ప్రివెన్షన్ తదితర అంశాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాద సమయంలో అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. ఇటువంటి శిక్షణా తరగతులవల్ల అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలను పణంగా పెట్టి ఇతరుల ప్రాణాలను రక్షించేందుకు దోహ దపడతాయని పరిశ్రమ ఏఎస్‌వో భవానిశంకర్ అన్నారు. ఈకార్యక్రమంలో పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ వివేక్‌శుక్లా, హెచ్ఆర్ చంద్రశేఖర్, అగ్నిమాపక అధికారులు కేవీవీ సత్యనారాయణ, వి.దివాకర్, టి.అప్పన్న, ఎస్.రాజుతో పాటు స్థానికులు పాల్గొన్నారు.


ఇథనాల్ పరిశ్రమలో అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్

కొంకుదురులో శివలింగాలకు అభిషేకాలు

బిక్కవోలు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కొంకుదురు సుబ్బారాయుడిగుడివద్ద 108 పార్థివ శివలింగాలకు దంపత యుక్తంగా శుక్రవారం అభిషేకాలు జరిపారు. రాజమహేంద్రవరం భూకైలాస్ రీజియన్ ట్రస్ట్ వారు కోటి పార్థివ శివలింగాలతో భారీఎత్తున త్వరలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కొంకుదురు గ్రామానికి 108 శివలింగాల తయారీ బాధ్యతను అప్పగించారు. దీంతో శివలింగాల తయారీ పూర్తవ్వడంతో గ్రామానికి చెందిన అర్చకులు రమణశర్మ, కృష్ణచైతన్యశర్మ, వెంకటరమణశర్మల ఆధ్వర్యంలో గ్రామంలోని 108 మంది దంపతులు శివలింగాలకు అభిషేకాలు చేసి ట్రస్ట్ వారికి అందజేశారు. అభిషేకాల అనంతరం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు.

'వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రాజానగరానికి ఇవ్వాలి'

దివాన్‌చెరువు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాజానగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రాజానగరం మండలానికి ఇవ్వాలని స్థానిక టీడీపీ నాయకులు పార్టీ అధిష్ఠానానికి ఏకగ్రీవంగా విజ్ఞప్తి చేశారు. దివాన్‌చెరువులో మాజీ ఎంపీటీసీ గంగి బ్రహ్మరాజు ఇంటివద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని గతంలో సీతానగరం, కోరుకొండ మండలాల వారికి ఇచ్చారని చెప్పారు. ఈ పర్యాయం తమ మండలానికి ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరిని కోరుతూ తీర్మానించారు. ఈ మేరకు టీడీపీ సీనియర్ నాయకులు గంగి బ్రహ్మరాజు, దాసరి శ్రీనివాసరావు, వంక మల్లికార్జునస్వామి, మట్టా సత్తిబాబు, పలివెల గంగరాజు తదితరులు సంతకాలతో సిద్ధంచేసిన పత్రాన్ని రుడా చైర్మన్‌కు అందజేస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

రేపు అండర్-9 బాల బాలికల
చదరంగం పోటీలు

రాజమహేంద్రవరంకల్చరల్ ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆదివారం తూర్పుగోదావరి జిల్లా చదరంగం వారి ఆధ్వర్యంలో అండర్ 9 బాలబాలికల చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ఈ పోటీలు గాంధీనగర్, శ్రీగౌతమీస్మార్ట్‌లో నిర్వహిస్తారన్నారు. పోటీల్లో గెలుపొందిన మొదటి ఇద్దరు బాలబాలికలు మన జిల్లా తరపున మే 3 నుంచి 5వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. క్రీడాకారులు తమ పేర్లను ముందుగా 19వ తేదీలోపు నమోదు చేయించుకోవాలని, వివరాలకు సెల్9848374133కి సంప్రదించాలని జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు.

జిల్లా బ్యాంకు ఉద్యోగులకు
ఆటల పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సమైక్య (ఏఐబీఈఏ) 80వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులకు క్రికెట్, చెస్, కేరమ్స్, బ్యాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహించారు. పోటీల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కోఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 20వ తేదీన జరిగే వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బహుమతి ప్రదానం చేస్తామని ఉద్యోగుల సంఘం కన్వీనర్ లక్ష్మీపతిరావు తెలిపారు. యూనిట్ నాయకులు శ్రీనివాస్, రమేష్, మురళీధర్, సూర్య, అప్పారావు, వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, కామేశ్వరరావు, కిషోర్, ప్రకాష్, రవిచంద్ర, మహిళా నాయకులు స్వాతి, ఉమరాణి పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ తోటకూర మృతి


మృతుడు తోటకూర నాగేశ్వరరావు

రాజానగరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మాజీ ఎంపీటీసీ తోటకూర నాగేశ్వరరావు (70) గుండెపోటుతో శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈయన టీడీపీలో అనేక పదవులు చేపట్టి గ్రామాభివృద్ధికి శ్రమించారు. ఎంపీటీసీ సభ్యులుగా, కాపునాడు రాష్ట్ర కార్యదర్శిగా, స్థానిక అన్నదానసత్రం, పీహెచ్‌సీ చైర్మన్‌గా సేవలందించారు. శుక్రవారం ఉదయం వాకింగ్ వెళ్లివచ్చి పూజకోసం పూలు కోసుకుని ఇంటి లోపలికి వెళుతున్న క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. హుటాహుటిన జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. ఈయన మృతిపట్ల సీఎం చంద్రబాబు ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నీలపాల అరవరాజు, నాయకులు కొణతం నర్సింహారావు, చిట్టిప్రోలు పద్దరాజు, సంగుల శ్రీను తదితరులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ, ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

గోకవరం, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహద పడతాయని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. గోకవరంలోని దేవీచౌక్ సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయంవద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. వాహనదారులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.


చలివేంద్రాన్ని ప్రారంభించిన కంబాల శ్రీనివాసరావు

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: గుడ్ బ్యాడ్ అగ్లీ
సూర్యమినీ	: జాట్, జాక్
సూర్యప్యాలస్	: సిన్నర్స్
స్వామి	: ఓదెల-2
శివజ్యోతి	: అర్జున్ s/o వైజయంతి
అనుశ్రీ(సాయికృష్ణ)	: అర్జున్ s/o వైజయంతి
రాజా	: ఓదెల-2
ఊర్వశి	: మ్యాడ్ స్క్వేర్
రంభ	: అక్కడ అమ్మాయి...
మేనక	: మధురం, డియర్ ఉమ
అప్సర	: అర్జున్ s/o వైజయంతి
కుమారి	: ఓదెల-2
అశోక	: అర్జున్ s/o వైజయంతి
వీఎస్ మహల్(నామవరం)	: అర్జున్ s/o వైజయంతి
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: అర్జున్ s/o వైజయంతి
వెంకటసూర్య(కడియం)	: అర్జున్ s/o వైజయంతి
సత్యగౌరి (అనపర్తి)	: ఓదెల -2
సూర్యశ్రీ (అనపర్తి)	: అర్జున్ s/o వైజయంతి
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: అర్జున్ s/o వైజయంతి
గీతాసినిమాస్(సీతానగరం)	: అర్జున్ s/o వైజయంతి
శ్రీనివాస (గోకవరం)	: అర్జున్ s/o వైజయంతి
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఓదెల-2
లలితామహల్(రంపచోడవరం)	: అర్జున్ s/o వైజయంతి
నవయుగ(చింతూరు)	: అర్జున్ s/o వైజయంతి



కదిలింది.. కరుణరథం!



గౌరీపట్నంలో సిలువతో విశ్వాసుల ర్యాలీ

గుడ్‌ఫ్రైడేను జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.. విశ్వాసులు సిలువ మోస్తూ.. కదిలింది కరుణరథం.. సాగిందీ క్షమాయుగం అంటూ ప్రార్థనా గీతాన్ని ఆలపిస్తూ క్రీస్తును కీర్తించారు.. ఉదయం నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. నలభై రోజుల ఉపవాస దీక్షలు ముగించారు.

8 వేములూరులో..

రెండో ఉచిత సిలిండర్‌కు క్యూ..



- ఉమ్మడి జిల్లాలో వినియోగదారులు 13 లక్షలు
- 2,82,198 మంది గ్యాస్ బుకింగ్
- 1,09,592 మంది ఖాతాల్లో సొమ్ము జమ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రెండో ఉచిత సిలిండర్‌కు లబ్ధిదారులు క్యూకడుతున్నారు. వేగంగా బుకింగ్‌లు చేసుకుంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతిరోజు పెద్దఎత్తున బుకింగ్స్ జరుగుతున్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో సుమారు 13 లక్షల మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి రెండో ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ఆరంభమైంది. ఇప్పటివరకు 2,82,198 మంది వినియోగదారులు ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోగా 1,09,592 మంది బ్యాంకు ఖాతాల్లోకి రూ.8.72 కోట్లు సబ్సిడీ సొమ్ము జమ అయింది. మిగిలిన వినియోగదారులకు మరో నాలుగు రోజుల్లో రాయితీ సొమ్ములు జమచేస్తారు. తూర్పుగోదావరి జిల్లాలో 91,382 మంది గ్యాస్ సిలిండర్లకు బుక్ చేసుకోగా 34,645 మంది వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.2.74 కోట్లు జమ అయింది. కాకినాడ జిల్లాలో 1,03,832 మంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోగా, 41,223 మంది బ్యాంకు ఖాతాల్లో రూ.3.27 కోట్ల రాయితీ సొమ్ము జమచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 86,984 మంది వినియోగదారులు గ్యాస్ సిలిండర్లకు బుక్ చేసుకోగా, 33,724 మందికి రూ.2.70 కోట్ల రాయితీ సొమ్ము జమచేశారు. వినియోగదారులు రెండో గ్యాస్ సిలిండర్‌ను ఈ ఏడాది జూలై 31వ తేదీలోపు బుక్ చేసుకోవాలని నిబంధన విధించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ దీపం-2 పథకానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. తొలి విడత, రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్లు బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు ఏదైనా కారణాల వల్ల రాయితీ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమకాకపోతే ఆయా జిల్లాల పౌరసరఫరాల శాఖ కార్యాలయాల్లో సంప్రదించాలని సంబంధిత అధికారులు వెల్లడించారు.



రె..డీఎస్సీ!

ఉపాధ్యాయ నిరుద్యోగులకు తీపికబురు

- నెరవేరనున్న కూటమి మరో హామీ
- ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందం
- ఉమ్మడి జిల్లాలో 95 వేల మంది పైనే
- 42 నుంచి 44 ఏళ్లకు పెంపు
- వయోపరిమితి పెంపుతో ఊరట
- ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ
- సమాయత్తమవుతున్న విద్యాశాఖ

కాకినాడ రూరల్/ అమలాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. టీడీపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నేడో రేపో నోటిఫికేషన్ విడుదలకానుంది. ఈనేపథ్యంలో ఎప్పటి నుంచో డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఉపాధ్యాయుల పోస్టుల భర్తీపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అడ్డంకులు దాటుకుని..

రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ నోటిఫికేషన్‌కు కొన్ని లక్షల మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటూ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని విస్మరించింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 16,347కు పైగా ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు చేసింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించి నవంబరులోనే ఫలితాలు ప్రకటించింది. కొన్ని సాంకేతిక కారణాలు, ఎమ్మెల్సీ కోడ్ అమలు, అభ్యర్థుల వయోపరిమితి పెంపు తదితర సమస్యలపై స్పష్టమైన నిర్ణయం రావాల్సి ఉన్నందున డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా పడుతూ వచ్చింది. ఇటీవల సీఎం చంద్రబాబు, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో ఏప్రిల్‌లోనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ పోస్టుల భర్తీని జూన్‌కల్లా పూర్తిచేస్తామని ప్రకటించడంతో అభ్యర్థులు నోటిఫికేషన్‌కు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనెల 20 లేదా 23న డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని తెలిసి హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 95 వేల మందికిపైగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

వైసీపీ తెచ్చిన తంటా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా స్కూలు అసిస్టెంట్లు, ఎస్జీటీ పోస్టులు మొత్తం కలిపి 1026 ఖాళీగా ఉన్నట్టు విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో అమలాపురం ఉప విద్యాశాఖాధికారి పరిధిలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి 908 ఖాళీలను గుర్తించినట్టు అధికారులు నిర్ధారించారు. ఇంకా జిల్లాలో కొత్తపేట, రామచంద్రపురం సబ్ డివిజన్ల పరిధిలో ఖాళీల సంఖ్య తేలాల్సి ఉంది. అయితే ప్రభుత్వానికి నివేదించిన జాబితాలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోస్టుల సంఖ్య భారీగా కుదించి నివేదించినట్టు ఉపాధ్యాయ సంఘాల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్జీటీ పోస్టులు రద్దుచేసి వారిని వేరే పోస్టులకు కేటాయించారు. ఆ పరిస్థితుల కారణంగా ఇప్పటికీ ఎస్జీటీ పోస్టుల ఖాళీలపై స్పష్టత లేదని వారు ఆరోపిస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో ఎయిడెడ్ పోస్టులను రద్దు చేసి ఆయా పాఠశాలలను మాత్రమే ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉపాధ్యాయుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే నోటిఫికేషన్‌కు నిరుద్యోగ యువకులు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. పోస్టుల్లో కోత విధిస్తే తమకు ఏమాత్రం ప్రయోజనం ఉండదనేది వారి ఆవేదన.

1278 పోస్టులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1,278 ఉపాధ్యాయ ఉద్యోగాలను డీఎస్సీ ద్వారా భర్తీచేయనున్నట్టు సమాచారం. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి ఆంగ్లం 90, తెలుగు 70, హిందీ 71, గణితం 55, ఫిజికల్ సైన్స్ 59, బయోలాజికల్ సైన్స్ 95, సోషల్ స్టడీస్ 114, సంస్కృతం 5, వ్యాయామ విద్య 199, ఎస్జీటీలు 349, పీజీటీ, టీజీటీ ప్రిన్సిపాల్స్ మొత్తం 171 ఖాళీలు డీఎస్సీ ద్వారా భర్తీచేయనున్నట్టు తెలిసింది.

ప్రత్యేక విద్యకు 288 పోస్టులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రత్యేక విద్యకు సంబంధించి 151 స్కూల్ అసిస్టెంట్లు, 137 ఎస్జీటీ ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీకానున్నాయి. వారంరోజుల్లోపు డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం.ఈ మేరకు విడిగా నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన 45 రోజుల తరువాత పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తోంది.

వయోపరిమితి 44

డీఎస్సీ అభ్యర్థులకు వయోపరిమితిని సడలిస్తూ పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం గరిష్ఠ వయోపరిమితి 42 ఏళ్లు కాగా దానిని 44 ఏళ్లకు పెంచారు. 2024 జూలై 1ని కటాఫ్ తేదీగా నిర్ణయించారు.ఈ సడలింపు ఈ ఒక్క డీఎస్సీకి మాత్రమే వర్తిస్తుందన్నారు.

● ఏపీ ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ఆర్డినెన్స్-25 జారీచేశారు. దీని ప్రకారం 3 ఎస్సీగ్రూపుల విషయంలో 200 రోస్టర్ పాయింట్ల విధానాన్ని అవలంబించనున్నారు. దీంతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి వర్గీకరణ ఆర్డినెన్స్‌తో మార్గం సుగమమైంది.

'సత్ప్రవర్తనతో ఉన్న ఖైదీలకు క్షమాభిక్షను దూరం చేయడం ఏ మాత్రమూ సబబు కాదు. మంచి ప్రవర్తనతో ఉన్నవారికి మరోసారి బాగా జీవించే అవకాశం కల్పించడం సరైన నిర్ణయమే'
- దేశ సర్వోన్నత న్యాయస్థానం

2019లో జైలులో ఆస్పత్రి శంకుస్థాపనకు సీఎం హోదాలో చంద్రబాబు వచ్చినప్పుడు.. 'మీరు మంచిగా మారండి. క్షమాభిక్ష జీవోల కోసం ఒత్తిడి పడొద్దు. నేనున్నాను. చూసుకుంటాను' అని హామీ ఇచ్చారు. అయితే విధి దగా చేసింది. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చింది. దీంతో క్షమాభిక్ష అవకాశాన్నిఆ ప్రభుత్వంలో ఖైదీలు కోల్పోయారనే చెప్పాలి. ఇప్పుడు మళ్లీ అవకాశం వచ్చింది.. ఖైదీల విడుదలకు చర్యలు చేపడుతున్నారు.



ఖైదీలకూ.. నేనున్నాని..

జీవిత ఖైదీలకు క్షమాభిక్ష

- కూటమి ప్రభుత్వంలో ఊరట
- సుప్రీం మార్గదర్శకాల అమలు
- జాబితాకు ప్రభుత్వ ఆదేశం
- కసరత్తులో జైలు అధికారులు
- వైసీపీ ప్రభుత్వంలో అన్యాయం
- గత జాబితా చెత్తబుట్టలోకి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో గత వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర మనోవేదన మిగిలింది. అప్పట్లో జగన్ ఖైదీల క్షమాభిక్ష పట్ల చేసిన కాలయాపన వారి పాలిట శాపంగా మారింది. 2023లో జాబితా ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాలనూ అప్పటి వైసీపీ ప్రభుత్వం పాటించకపోవడంతో ఆ జాబితా ఇప్పుడు చెత్త బుట్టలో పడేసే పరిస్థితి వచ్చింది. దీంతో రెండేళ్లుగా ఆ ఖైదీలు ఎదురుచూపులు చూస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎస్ఎల్‌పీ (క్రిమినల్) నెం.529/2021లోని సుప్రీం ఆదేశాలను పాటిస్తూ ఈనెల 17న జీవో నెం.71 జారీచేయడంతో పెండింగ్‌లో ఉన్న జాబితా నీరు గారిపోయినట్టేనని చెబుతున్నారు. జైళ్లశాఖ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం క్షమాభిక్షకు అర్హులైన ఖైదీల జాబితా సిద్ధం కానుంది.

నాడు వైసీపీలో ఒక్కసారే..

సుప్రీం మార్గదర్శకాల ప్రకారం ఏడాదికి మూడు దఫాల్లో విడుదలకు అర్హులైన జాబితాలను అధికారులు ఎప్పటికప్పుడు పంపించినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో జగన్ ప్రభుత్వంలో ఎదురుచూపులతో ఖైదీలో జైలులోనే మగ్గిపోయారు. జగన్ జమానా ఐదేళ్లలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక జైలులో కలుపుకొని సుమారు 60 మంది మాత్రమే బయటకు వెళ్లారు. 2021లో విడుదలకు సుముఖత వ్యక్తం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినా ఏడాది ఆలస్యంగా ఆగస్టు 15న 2022లో విడుదల చేశారు. మరో అన్యాయం ఏమిటంటే.. 2022లో వదిలిన ఖైదీలకు 2021ని కటాఫ్‌గా తీసుకున్నారు. అలా కాకుండా 2022 కటాఫ్‌గా తీసుకుంటే మరికొంత మంది తమ కుటుంబాల చెంతకు చేరేవారు.

సుప్రీం మార్గదర్శకాలు..

గతంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఖైదీలను విడుదల చేసేవి. దీంతో ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా నిబంధనలు ఉండేవి. వీటిపై సుప్రీం కోర్టులో ఎస్ఎల్‌పీలు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు దేశం మొత్తానికి ఒకే విధమైన మార్గదర్శకాలు విడుదల చేసింది. వాటి ప్రకారం ఆయా రాష్ట్రాలు జీవోలు ఇవ్వాలి. ఈ మేరకు కూటమి ప్రభుత్వం సుప్రీం మార్గదర్శకాలను అనుసరిస్తూ జీవో విడుదల చేసింది.

గతం : సాధారణ జీవిత ఖైదీలకు ఏడేళ్ల శిక్ష, మూడేళ్ల రెమిషన్‌తో కలుపుకొని పదేళ్లు, 498(ఏ), డెకాయిటీ, దొంగతనాలు వంటి నేరాల్లో 14+6, మహిళలకు 3+2, 65 ఏళ్లు దాటిన వాళ్లకు ఐదేళ్ల శిక్ష, రెండేళ్ల రెమిషన్‌తో ఏడేళ్లు శిక్ష పూర్తి చేస్తే క్షమాభిక్షకు అర్హత ఉండేది.

ప్రస్తుతం : అన్ని జెండర్లకూ ఒకేలా నిబంధనలు ఉన్నాయి. మరణశిక్ష పడిన వారికి 14 ఏళ్ల జైలు.. ఆరేళ్ల రెమిషన్ మొత్తంగా 20 ఏళ్ల శిక్ష అనుభవించి ఉండాలి (ఆరేళ్ల రెమిషన్ నమోదు కావాలంటే కనీసం 16 ఏళ్లపాటు సత్ప్రవర్తనతో జైలు జీవితం గడపాలి. జీవిత ఖైదులకు 7+3 ఉండాలి. ఎన్‌డీపీ ఎస్, ఎస్సీఎస్టీ కేసుల్లో, ప్రివెన్షన్ ఆఫ్ టెర్రరిజం చట్టం 2002 ప్రకారం, ఐపీసీ 363ఏ, 364, 364ఏ, 366, 366బీ, 367, 368, 369, 372, 373 ప్రకారం శిక్షపడిన వారు క్షమాభిక్షకు అర్హులు కాదు. మరికొన్ని నిబంధనలు ఇచ్చారు.

ఏడాదికి మూడు సార్లు

సుప్రీం మార్గదర్శకాలను అనుసరించి ఏడాదికి మూడుసార్లు క్షమాభిక్ష జీవోలను విడుదలచేస్తారు. మొదటి ఫేజుకు జూన్1, రెండో ఫేజుకు అక్టోబరు 1, మూడో ఫేజుకు ఫిబ్రవరి 1 కటాఫ్ తేదీలుగా పరిగణిస్తారు. నాలుగు దశల్లో ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది.ఫేజ్ 1లో భాగంగా జనవరి 1 నుంచి 15వ తేదీలోపుగా, ఫేజ్ 2లో మే 1 నుంచి 15వ తేదీలోగా, ఫేజ్ 3లో సెప్టెంబరు 1 నుంచి 15వ తేదీలోగా అర్హులైన ఖైదీలను గుర్తించాల్సి ఉంటుంది. ఆపై జైలు అధికారులు మూడు నెలల్లోగా సంబంధిత పత్రాలు సిద్ధం చేసుకోవాలి. జైలు అధికారులు ప్రిజన్స్ డైరెక్టర్ జనరల్‌కి సిఫారసు చేసిన తర్వాత మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక అందాలి. అనంతరం మూడు నెలల్లో ప్రభుత్వ నిర్ణయం వెలువడాలి. ఫేజ్1కి అక్టోబరు 1, ఫేజ్2కి ఫిబ్రవరి1, ఫేజ్ 3కి జూన్1లోగా ప్రభుత్వ నిర్ణయం వెలువడాల్సి ఉంటుంది.


చీటీల డబ్బుతో కుటుంబం పరారీ

నిడదవోలు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చీటింగ్ చేసి ఒక కుటుంబం పరారైంది. దీంతో పలువురు లబోదిబోమంటున్నారు. నిడదవోలు మండలం కంసాలిపాలెంకు చెందిన గరగ నాగలక్ష్మి చాలా కాలంగా చీటీల వ్యాపారం చేస్తుంది. నమ్మకంగా సొమ్ములు చెల్లిస్తుండడంతో కొద్ది మొత్తంతో ఆరంభమైన చీటీల వ్యాపారం లక్ష రూపాయలు వేసే వరకూ చేరింది. ఇదిలా ఉండగా ఇటీవల సుమారు 20 మంది నుంచి డబ్బులు తీసుకుని ఖాతా దారులకు సొమ్ము చెల్లించకుండా కాలయాపన చేస్తుంది. డబ్బులు చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో కుటుంబసభ్యులు గరగ బుల్లియ్య, గరగ శివరామకృష్ణలతో కలిపి ఊరు వదిలి వెళ్లిపోయిందని నక్కా నాగేశ్వరరావు శుక్రవారం సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

3735 వాహనాలు తనిఖీ

- జిల్లాలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు
- 27 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు
- 61 వాహనాలు స్వాధీనం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు నాకాబందీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 32 ప్రాంతాల్లో నలుగురు అడిషనల్ ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, ఎస్‌డీపీవోలు, 21 మంది సీఐలు, ఆర్ఐలు, 38 మంది ఎస్ఐ లు, డబ్ల్యు ఎస్ఐ ,ఆర్ఎస్ఐ, డబ్ల్యుఆర్ఎస్‌లు, 186 మంది పోలీసులు కలిసి పక్కాగా తనిఖీలు చేశారు. గురువారం రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకూ అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో 32 పాయింట్లలో బస్సులు, లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలతో సహా అన్నింటినీ పరిశీలించారు. మొత్తం 3735 వాహనాలను తనిఖీ చేసి 27 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. 15 మందికి జరిమానాలు విధించారు. సరైన పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న 61 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.ఎంవీ యాక్ట్ ఫైన్ రూ 4,370 విధించారు.ఎస్పీ నరసింహ కిశోర్ స్వయంగా పర్యవేక్షించి పలు వాహనాల్లో సోదాలు చేశారు. సెంట్రల్ జోన్‌కి అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీ కృష్ణ, నార్త్ జోన్‌కి క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్, ఈస్ట్ జోన్‌కి ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎల్.చెం చురెడ్డి, కొవ్వూరు డివిజన్‌కి శాంతి భద్రతల అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బ రాజు సారథ్యం వహించగా.. మొత్తం సుమారు 200 మంది తనిఖీల్లో పాల్గొన్నారు.సీట్ బెల్టు,హెల్మెట్‌పై అవగాహన కల్పించారు.గోపాలపురం స్టేషన్ పరిధిలో ఒక ట్రావెల్ బస్సు డ్రైవరు మద్యం తాగి ఉండడం గమనించారు.బస్సులో 40 మందికిపైగా ప్రయాణికులున్నారు.వెంటనే ఆ డ్రైవరును బస్సు నుంచి దించేసి రెండో డ్రైవరుతో బస్సు పంపించారు.



కారును తనిఖీ చేస్తున్న డీఎస్పీ రమేష్‌బాబు



ద్విచక్రవాహనం తనిఖీ చేస్తున్న ఎస్పీ



బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

నేడు స్వచ్ఛ దివస్

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రత్యేక కాన్సెప్ట్‌తో ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా శనివారం ఈ వేస్ట్ డిస్పోజబుల్ కార్యక్రమం నిర్వహించాన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, గృహాల్లో వృథాగా ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను మునిసిపల్, గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేస్టు సేకరణ కియోస్క్‌లకు తరలించాలన్నారు.రూరల్ మండలం పరిధిలో గల వైటీసీ ప్రాంగణంలో శనివారం జిల్లాస్థాయి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పక్కన పడేసిన పనికిరాని యంత్రాలను ఆ కియోస్క్‌లకు తరలించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడికక్కడ శుభ్రంగా ఉండాలన్నారు.నేడు స్వచ్ఛ దివస్‌లో భాగంగా సిబ్బంది విధిగా దృష్టి సారించాలన్నారు.

ప్రభుత్వ బోధనాసుపత్రికి రూ.2 కోట్లతో పరికరాలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి రూ.2 కోట్ల విలువైన పరికరాలను రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సమకూర్చనున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వాసుపత్రికి అవసరమైన జనరేటర్, ఇన్వర్టర్లు, అంబులెన్సు తదితర పరికరాలను మే నెలలోపు అందించనున్నారన్నారు. విడతల వారీగా పరికరాలు ఆసుపత్రికి చేరతాయని పేర్కొన్నారు. ఆరోగ్యభారతం, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, ఆరోగ్య రాజమహేంద్రవరం పార్లమెంట్, ఆరోగ్య రాజమహేంద్రవరం సిటీ సాధనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు.

బోరు..బోరుమంటున్నారు!

వేసవి వచ్చేసింది.. చాలా ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడితో గొంతెండిపోతోంది.. తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయినా అధికారుల్లో కదలిక లేదు. ఈ చిత్రంలో చూస్తున్నారుగా ఇవి మెట్టప్రాంతమైన గోకవరం మండలంలోని అచ్యుతాపురం, కృష్ణునిపాలెం, గంగపాలెం, ఠాకూరుపాలెం, కొత్తపల్లి, గోకవరం గ్రామాల్లో చేతిపంపుల దుస్థితి.. ఇంతలా ఉన్నా ఏ ఒక్కరూ అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవు. ఆయా గ్రామాలకు బోరు నీరే ఆధారం. అయినా ఎందుకో నిర్లక్ష్యం మరి.. గోకవరం మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో 480 చేతి పంపులు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. వీటిలో 465 పంపులు పనిచేస్తున్నట్టు 15 పంపులు మాత్రమే మరమ్మతుకు గురైనట్టు సంబంధిత అధికారులు లెక్కల్లో చూపిస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. సగానికి పైగా చేతి పంపులు పనిచేయడంలేదని సమాచారం. దీంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడంలేదు. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లోనూ ఈ పరిస్థితి ఉంది. తాగునీరందక బోరుబోరుమంటున్నారు. - గోకవరం









అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



ఆంధ్రాసుగర్స్ ఫ్యాక్టరీలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కొవ్వూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై కార్మికులు అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు అగ్నిమాపకశాఖాధికారి ఏవీఎస్ఎస్ఎస్ వేణు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఆంధ్రాసుగర్స్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదాల నివారణపై ఉద్యోగులు, కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనిలో భాగంగా నో స్మోకింగ్ బోర్డుల ఆవశ్యకత, అగ్నిమాపక ప్రమాదాల నివారణకు వినియోగించే పరికరాల గురించి డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ఎస్. సీతారామయ్య, బీ. పోశయ్య, ఎం. రవికుమార్, కే. ధనుంజయరావు, వై. రాంబాబు, వీ. తాండవకృష్ణ, ఎం. శ్రీను, ఆంధ్రాసుగర్స్ సేఫ్టీ ఆఫీసర్ కేవీవీ సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ పర్సనల్ మేనేజర్ సీహెచ్ఎస్ మహర్షి, ఉద్యోగులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు వేతనాలు చెల్లించండి



ఉప సర్పంచ్ రామకృష్ణతో మాట్లాడుతున్న కూలీలు

తాళ్లపూడి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెద్దేవం ఉపాధి హామీ కూలీలకు జనవరి నెల నుంచి వేతనాలు చెల్లించడం లేదని ఆ గ్రామ ఉప సర్పంచ్ తోట రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ఈ సమస్యను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లానని, లేనిపక్షంలో సోమవారం కలెక్టరేట్లో ఫిర్యాదు చేస్తానని చెప్పారు. అనంతరం ఏపీవో రమాదేవి మాట్లాడుతూ ఉపాధి కూలీల జీతాలు రావాల్సి ఉందని, ప్రభుత్వం విడుదల చేసిన వెంటనే వారికి చెల్లింపులు జరుగుతాయని తెలిపారు.

రూ.రెండు కోట్లతో యాదవోలు వాగు పూడికతీత



దేవరపల్లిలో యాదవోలు వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఇతరులు

దేవరపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): యాదవోలు వాగు పూడికతీత, సుందరీకరణకు మొదటి విడతలో రూ. రెండు కోట్లతో పనులు చేపడతామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. దేవరపల్లిలో శుక్రవారం యాదవోలు వాగు పరిసర ప్రాంతం, స్టేట్ బ్యాంకు వీధి పోతన కుంట పరీవాహక ప్రాంతాన్ని శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించి ఆయాప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీలోని చెత్తను తొలగించి సుందకరీకరణ చేస్తామన్నారు. యాదవోలు వాగు నుంచి సుమారు రెండు కిలోమీటర్ల వరకు దేవరపల్లి నడిబొడ్డును ఈ వాగు ఉం డటంతో మురుగు నిల్వ ఉండటం వల్ల గ్రామస్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వెంటనే డ్రైనేజీ నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, కాట్రు భీమరాజు, యలమాటి అక్కిరాజు, జనసేన నాయకులు సూరిశెట్టి బాలు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గద్దే సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామదేవత కడియాలమ్మకు ఎమ్మెల్యే మద్దిపాటి, టీడీపీ నాయకులు, తదితరులు పూజలు నిర్వహించారు.

రేపు చదరంగం పోటీలు

రాజమహేంద్రవరంకల్చరల్ ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆదివారం తూర్పుగోదావరిజిల్లా చదరంగం వారి ఆధ్వర్యంలో అండ ర్ 9 బాలబాలికల చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు. ఈ పోటీలు గాంధీనగర్, శ్రీగౌతమీస్మార్ట్‌లో నిర్వహిస్తారన్నారు. పోటీల్లో గెలుపొందిన మొదటి ఇద్దరు బాలబాలికలు మన జల్లా తరఫున మే 3 నుంచి 5వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపిక చేస్తారన్నారు.



వేములూరులో కొవ్వూరు, తోగుమ్మి ఆర్‌సీఎం చర్చి సంఘస్తులు నిర్వహిస్తున్న శిలువ యాత్ర



గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్‌లో శిలువ యాత్రలో క్రైస్తవ విశ్వాసులు

గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు

• పలుచోట్ల శిలువయాత్రలు, ర్యాలీలు
• పెద్ద ఎత్తున పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు

కొవ్వూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని ఆర్‌సీఎం చర్చి సంఘస్తులు శుక్రవారం శిలువయాత్ర చేపట్టారు. తోగుమ్మి ఆర్‌సీఎం చర్చి నుంచి వేములూరు దీప్తి స్కూల్లోని ఆర్‌సీఎం చర్చి వరకు పవిత్ర శిలువ మార్గము (యాత్ర) నిర్వహించారు. ఏలూరు ఆర్‌సీఎం బిషప్ పొలిమెర జయరావు ఆధ్వర్యంలో జరిగింది. శనివారం రాత్రి జాగారపు ప్రార్థనలతో క్రీస్తు పునరుద్థాన పండుగను నిర్వహించనున్నట్టు సంఘకాపరి తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్స్ పి. దిలీప్, కె. గాబ్రియేలు, వలయవీడు నెల్సన్ ఆంటోని, మదర్‌థెరిస్సా హోం నిర్వాహకులు బి. విజయకుమార్, వీటీ విల్సన్‌రాజు, రాజేష్, కృష్ణ, కన్యాస్త్రీలు, పశివేదల, తోగుమ్మి గ్రామాల సంఘస్తులు పాల్గొన్నారు. కొవ్వూరు మండలంలోని క్రీస్తు దేవాలయాలలో గుడ్‌ఫ్రైడేను పురస్కరించకుని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

సర్వమానవాళి విమోచనకు ప్రభువైన క్రీస్తు శిలువను మోసి, ప్రాణాలు అర్పించిన రోజును గుడ్‌ఫ్రై డేగా క్రైస్తవులు జరుపుకున్నారు. శుక్రవారం పట్టణంలోని మెరకవీధి సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి, నాల్గో వార్డులోని ఇమ్మానియేలు మినిస్ట్రీస్, టౌన్ లూథరన్ చర్చి, కంఘమణి వారి వీధి అగాపే సంఘం, సియోను ప్రేయర్ హౌస్‌లలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దీంతో క్రైస్తవ దేవాలయాలు విశ్వాసులతో కిటకిటలాడాయి. మెరకవీధి సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి ప్రార్థనలు నిర్వహించారు.

తాళ్లపూడి: ఈ సువిశాల దేశంలో ప్రజలంతా వివాదాలకు తావి వ్వకుండా శాంతి, ప్రేమ, దయ చూపుతూ జీవించాలని ఏలూరు పీఠాధిపతులు పొలిమేర జయరావు తెలిపారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా వేగేశ్వరపురం గోదావరి మేరీమాత ఆలయ ఫాధర్ జాన్ ఆధ్వర్యంలో శుక్రవారం శిలువయాత్రను చేపట్టారు. ముఖ్య అతిథిగా జయరావు పాల్గొన్నారు. తాళ్లపూడి నుంచి వేగేశ్వరపురం ఆర్‌సీఎం చర్చి వరకూ విశ్వాసులు ఏసును ప్రార్థిస్తూ శిలువ యాత్ర కొనసాగింది. కార్యక్రమంలో పలు గ్రామాల విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: విశ్వాసులు యేసు క్రీస్తు కలిగిన దయాగుణం కలిగి ఉండాలని విన్ అఫ్ ప్రేయర్ హౌస్ పాస్టర్ మరపట్ల జోజి అన్నారు. శుక్రవారం చీపురుగూడెంలో పాస్టర్ జోజి మాట్లాడుతూ సిలువపై యేసు పలికిన ఏడు మాటలను ధ్యానించారు. పుల్లలపా డులో ఫాదర్ అంటోని, పాస్టర్ యేసురత్నం ఆధ్వర్యంలో సిలువను మోస్తూ గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కే. చంటియ్య, జి. రమేష్, సుబ్బారావు, గంగరాజు పాల్గొనగా, సుభద్రపాలెం బ్రదర్ సంజాయ్, పోతవరంలో రాజేష్‌కుమార్, అనంతపల్లిలో నేవహూ, నల్లజర్ల ఆర్‌సీఎంలో ఫాదర్ జోషఫ్ శాంతప్ప, పాదర్ సబ స్టీన్ ఆధ్వర్యంలో సిలువ ధ్యాన ఆరాధనలు జరిగాయి.

గోపాలపురం: క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను శుక్రవారం వేడుకగా జరుపుకున్నారు. వేలచింతల గూడెం ఆర్‌సీఎం చర్చ్‌కు చెందిన విశ్వాసులు వేలచింతలగూడెం చర్చి నుంచి గోపాలపురం వరకు శిలువను మోసుకుని యాత్ర చేపట్టారు. అలాగే గోపవరం ఆర్‌సీఎం చర్చి విశ్వాసులు శిలువ మోస్తూపురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవ సోదరులు గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. క్రీస్తు సిలువ మరణం గురించి ప్రత్యేక గీతాలు పాడారు. పాస్టర్లు యేసుక్రీస్తు సిలువ మరణం, సిలువ మరణంలో ఉండగా క్రీస్తు పలికిన ఏడుమాటలు గురించి భక్తులకు వివరించారు. అలాగే లూథరన్ చర్చి, బైబిల్ మిషన్, పెంతుకొస్తు, ఆర్‌సీఎం, తదితర చర్చిల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

దేవరపల్లి: గుడ్‌ఫ్రైడే రోజున ఏసుక్రీస్తు శిలువపై మరణించారని క్రైస్తవులు విశ్వసిస్తారని నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ అన్నారు. గౌరీపట్నంలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా గ్రామంలో ఏసుశిలువను మోస్తూ పురవీధుల్లో ఏసునామం కీర్తిస్తూ ఏసుప్రభువు గొప్పతనం , మహిమల గురించి వివరిస్తూ శిలువ యాత్ర శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ జ్ఞానేశ్, ఏసుబాబు, గిరీశ్, నిర్మలగిరి కాలేజీ ప్రిన్సిపల్ లారా , సిస్టర్స్ రోషిత, ప్రియవద, సునీత, దిరిసిన ఫాతిమా, రాణి , తదితరులు పాల్గొన్నారు.



నల్లజర్ల : పుల్లలపాడులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవ విశ్వాసులు



తాళ్లపూడి : శిలువ యాత్రలో ఏలూరు పీఠాధిపతులు జయరావు



ఉండ్రాజవరం లూథరన్ చర్చిలో ...

ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికలో పాల్గొన్న ఫార్మా కంపెనీ ప్రతినిధులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్

కొవ్వూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రాంగణ ఎంపికలో పాల్గొనే విద్యార్థులకు కళాశాలలో ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నట్టు కొవ్వూరు అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామ్మోహన్ తెలిపారు. కొవ్వూరు ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బహుళ జాతి ఫార్మా కంపెనీ ఎంఎస్ఎన్ ల్యాబ్ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామ్మోహన్ మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థులకే కాకుండా ఇతర కళాశాలల విద్యార్థులు పాల్గొనేలా ప్రాంగణ ఎంపికలు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం ఎంఎస్సీ, బీఎస్సీ, బీ ఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. దాదాపు 10 జిల్లాల నుంచి 208 మంది విద్యార్థులు హజరయ్యారు. ఎంఎస్ఎన్ ఫార్మా ప్రతినిధులు టీ. శ్రీనివాస్, ఎస్.కిరణ్‌కుమార్, రవికుమార్ కంపెనీ నియమనిబంధనల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల అడ్వయిజర్ నందిగం వెంకట సుబ్బారావు, ప్రాంగణ ఎంపికల అధికారి కే. సూరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. రమేష్, పీజీ డైరెక్టర్ సీహెచ్ చలపతిరావు, అధ్యాపకులు నసీర్‌ఖాన్, శ్రీనివాస ప్రవీణ్, డీ. సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా వరి కోతలు ప్రారంభం

• ఆశాజనకంగా పంటదిగుబడి



దుద్దుకూరులో ధాన్యాన్ని ఆరబెడుతున్న కూలీలు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో దాళ్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం దిగుబడి ఆశాజనకంగా ఉన్నట్టు రైతులు పేర్కొంటున్నారు. మండలంలో 11వేల ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. 45 వేల మెట్రిక్ టన్నులు దిగుబడే లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు. వీటిలో 1121 రకం వరిని రైతులు 80 శాతం వేయగా, ఎకరాకు 50 నుంచి 55 వరకు బస్తాలు వస్తున్నట్టు వారు చెబుతున్నారు. మరికొంత మంది రైతులు పీఆర్ 126 వరి రకాన్ని వేశారు. మండలంలో ప్రస్తుతం 20 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. దాళ్వా సీజన్‌లో తెగుళ్ల బారి నుంచి పంట బయటపడిందని, కోతలు సమయంలో వాతావరణం అనుకూలిస్తే రైతులకు మేలు జరుగుతుందని ఉండ్రాజవరం గ్రామానికి చెందిన రైతు ఎం. కోటేశ్వరరావు చెప్పారు. ఈ నెలాఖరులోగా 80 శాతా న్ని పైగా కోతలు పూర్తవుతాయని ఏవో ఎం. విశ్వాసరావు చెప్పారు. ప్రభుత్వం 75 కేజీల బస్తాకు రూ.1720 చెల్లిస్తుందన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నట్టు ఏవో చెప్పారు.

7,200 ఎకరాల్లో వరి సాగు



దేవరపల్లిలో...

దేవరపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో 7,200 ఎకరాల్లో వరిని రైతులు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది దాళ్వాలో 40-45 బస్తాలు దిగుబడి వచ్చింది. అలాగే మండలంలో 15 సెంటర్స్‌లో ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇప్పటివరకు 5 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఏఓ కే.విజయ్ తెలిపారు. క్వింటా ధాన్యం ధర రూ. 2300 ఉందని తెలిపారు. ఈ సందర్భంగా రైతు ముళ్లపూడి వీరవెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, పంట దిగుబడి కూడా బాగానే వచ్చిందని తెలిపారు. రైతుల ఖాతాల్లో 24 గంటల్లో సొమ్ములు జమ అవుతాయన్నారు.

ముంపునకు గురవుతున్న ప్రాంతాల్లో ఎమ్మెల్యే సందర్శన



గోపాలపురంలో నిర్మించబోయే డ్రైన్లు, కల్వర్టుల మ్యాప్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎగువ కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురవుతున్న లోతట్టు ప్రాంతాలను ప్రక్షాళన చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురం పట్టణంలో దశాబ్దాల కాలంగా జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ వాదాల కుంట, కోమటి కుంట, గ్రామాలలో ఎగువన కురుస్తున్న వరద నీటి ప్రవాహంతో గోపాలపురంలోని ఉప్పరగూడెం, గౌడపేట, రొంగలివారివీధి, 5వ వార్డు, తదితర ప్రాంతాలు జలమయమ వుతున్నాయన్నారు. గత ఎన్నికల ముందు ఈ ప్రాంత వాసులకు మాటిచ్చానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గోపాలపురంలో ఆరుప్రదేశాల్లో శాశ్వత ప్రతిపాదికన కల్వర్టులు, డ్రైన్‌లు నిర్మించాల్సిన ప్రదేశాలను ఆయన స్వయంగా పరిశీలించారన్నారు. కల్వర్టులు, డ్రైన్ల నిర్మాణానికి అవసరమైన కోటి 5 లక్షల రూపాయల జిల్లా పరిషత్ నిధులతో సత్వరం పనులు ప్రారంభించాలని పంచాయతీ రాజ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు జ్యేష్ట శ్రీధర్, కార్యదర్శి వడ్లమూడి రమేశ్, పంచాయతీ రాజ్ ఏఈ పవన్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాల కుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు వేముల నాగరాజు, తెలుగు యువత అధ్యక్షుడు కాట్రగడ్డ సురేశ్, మాజీ ఎంపీటీసీ కూనపం ప్రసాద్ బాబు, దాసరి రవి, మద్దిపాటి రమేశ్, హోతా రాజాబాబు, తానేటి వీరరాఘవులు, కొడవటి చినవెంకటేశ్, మల్లిపూడి సుబ్బారావు, కొడమంచిలి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కుట్టను ఢీకొని వ్యక్తి మృతి



వీరవెంకటరమణ (ఫైల్)

దేవరపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): యర్నగూడెం, కృష్ణంపాలెం సర్వీసు రోడ్డులో ధాన్యం కుట్టను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. కృష్ణంపాలెం యర్నగూడెంకు చెందిన పుట్టా వీరవెంకటరమణ (30) అనే వ్యక్తి అమ్మమ్మ ఊరైన కొత్తగూడెంలో ఉంటున్నాడు. ఈ క్రమంలో రోజువారీ లాగా కూలి పనికి వెళ్తుంటాడు. గురువారం అర్ధరాత్రి సుమారు 2.30 గంటల ప్రాంతంలో యర్నగూడెం నుంచి ద్విచక్రవాహనంపై కొత్తగూడెం వెళ్తుండగా, కృష్ణంపాలెం సమీపంలోని రహదారిపై ఆరబెట్టిన ధాన్యం గుట్టలను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో హైవే అంబులెన్స్‌లో గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అక్కడ మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు చోరీ



చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న బాధితుడు శేషారావు

దేవరపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): యర్నగూడెం, సంగాయిగూడెం మధ్యలోని ఆచంట శేషారావుకు చెందిన పొలంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులకొట్టి విలువైన రాగివైరు, ఆయిల్‌ను దొంగిలించుకు పోయారని ఆ రైతు తెలిపారు. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. వేసవికావడంతో వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలని కోరారు. పొలంలో విద్యుత్‌వైర్లు కోసుకుపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగివైర్లు దొంగిలించటం వంటి సంఘటనలు జరుగుతున్నాయని, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయాప్రాంతాల వారు కోరుతున్నారు.

'వినియోగంలో లేని వేస్టును అందజేయాలి'

కొవ్వూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వినియోగంలో లేని అన్నిరకాల ఎలక్ట్రానిక్స్ వస్తువులను పురపాలక సంఘ ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో అందజేయాలని మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా ప్రతి మూడో శనివారం నిర్వహించే కార్యక్రమంలో ఈనెల (ఏప్రిల్ మాసం) థీమ్‌లో వినియోగంలో లేని అన్నిరకాలైన ఎలక్ట్రానిక్స్ వస్తువులను స్వీకరించడమన్నారు. పట్టణంలోని ప్రజలు, వ్యాపారస్తులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో ఉన్న ఈ వేస్టును పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆర్ ఆర్‌ఆర్ సెంటర్‌లో అందజేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పాడైపోయి, వినియోగంలో లేని కంప్యూటర్ సిస్టమ్స్, ప్రింటర్స్ ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, ఎలక్ట్రానిక్స్ వస్తువులతో కూడిన ఈ వేస్టును ప్రజల ఆరోగ్య, పర్యావరణ రక్షణకై తమవంతు బాధ్యతగా ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లో అందజేయాలన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వీకరించిన అన్నిరకముల ఎలక్ట్రానిక్స్ వస్తువులను పురపాలక సంఘం వారు ఏజన్సీల ద్వారా ప్రజలకు, పర్యావరణానికి హాని కలుగకుండా ఉండే విధంగా సరైన రీతిలో రీసైకిల్ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని కొవ్వూరు పట్టణాన్ని స్వచ్ఛపట్టణంగా తీర్చిద్దిడానికి సహకరించాలన్నారు.

ఘనంగా మాంటిస్సోరీ పాఠశాల వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

తాళ్లపూడి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూడిలోని మాంటిస్సోరీ పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ తోట రామకృష్ణ మాట్లాడుతూ మంచి విద్యార్థి కావాలంటే మంచి పాఠశాల మాత్రమే కాదని, విద్యార్థులు జీవితానికి అపకారం చేస్తున్న సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచి తల్లితండ్రులు కూడా పిల్లలకు మంచి నడవడిక నేర్పాలని తెలిపారు. కార్యక్ర మంలో పాఠశాల కరస్పాండెంట్ వీవీ అనీష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో విలువలతో కూడిన విద్యను గత 23 సంవత్సరాలుగా విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. ముందుగా అనీష్ దంపతులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, ఇతరులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్ రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో తూర్పుగోదావరి జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లేబర్ కోడ్స్‌పై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మే 20వ తేదీన 11 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్మికవర్గం ఐక్యంగా లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలనే డిమాండ్స్‌ను కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికగా తెలియజేయనున్నామని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఇప్పుడున్న కార్మికుల హక్కులను కూడా హరించి వేయాలని చూస్తున్నదని ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శిగా బి.పవన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు ఎస్ఎస్ మూర్తి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుందర్‌బాబు, బి.పవన్, జిల్లా కోశాధికారి కేఎస్‌వీ రామచంద్రరావు పాల్గొన్నారు.